VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : బుధవారం 24.06.2026

సంపుటి : 08 సంచిక : 15 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com


## ధాన్యం సేకరణ లక్ష్యాలు పెంచండి



3

# ఖట్టర్‌తో సీఎం రేవంత్, కిషన్‌రెడ్డి కీలక భేటీ

- దరాబాద్ మెట్రో రెండో దశపై విస్తృత చర్చలు
- ఐఆర్ఎఫ్‌సీ రుణంపై కేంద్రంతో మంతనాలు
- తెలంగాణ కీలక ప్రాజెక్టులకు సహకారం కోరిన రాష్ట్రం
- నిధుల సమీకరణపై ప్రధానంగా చర్చించిన నేతలు
- ఖట్టర్ నివాసంలో జరిగిన కీలక సమావేశం
- అశ్వినీ వైష్ణవ్ పాల్గొనడంతో పెరిగిన ప్రాధాన్యం
- మెట్రో విస్తరణ పనులపై కార్యాచరణ సమీక్ష
- వరుసగా రెండో రోజు కేంద్ర మంత్రులతో సమావేశాలు
- త్వరలోనే ప్రాజెక్టులకు స్పష్టత వచ్చే అవకాశం



**న్యూఢిల్లీ వెలుతురు జూన్ 23:**

తెలంగాణలో మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,

కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి సంయుక్తంగా సమావేశమయ్యారు.

## కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు సహకరించండి

- రామ్మోహన్ నాయుడితో మంత్రి తుమ్మల భేటీ
- గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుపై కీలక చర్చలు
- కొత్త స్థలంలో ఫీజిబులిటీ సర్వే ప్రతిపాదన
- త్వరగా సర్వే పూర్తి చేయాలని విజ్ఞప్తి
- రాష్ట్ర ప్రభుత్వ కొత్త ప్రతిపాదనపై చర్చ
- భద్రాచలం ప్రాధాన్యాన్ని వివరించిన తుమ్మల



2

## మోడీ కేబినెట్ విస్తరణ వేళ సంచలనం

- కేంద్ర మంత్రి పదవికి జార్జ్ కురియన్ రాజీనామా
- ఆమోదించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- ఢిల్లీలో జోరందుకున్న కేబినెట్ ప్రక్షాళన ప్రచారం
- రాజ్యసభ పదవీకాలం ముగియడంతో తప్పని ఉద్వాసన



2

## భారతదేశ అసలు సిసలైన హీరో శ్యామాప్రసాద్ ముఖర్జీ

- దేశం కోసం యుద్ధం చేయడానికి జన సంఘ్ కార్యకర్తలకు తుపాకీలిచ్చి పాకిస్తాన్ పై యుద్ధం చేయడానికి పంపిన వీరుడు·
- పార్టీ, రాజకీయాల కంటే దేశమే ఫస్ట్ అని చాటి చెప్పిన గొప్ప నేత
- దేశం కోసం ఆత్మ బలిదానం చేసుకున్న ఏకైక జాతీయ పార్టీ అధ్యక్షులు
- శ్యామాప్రసాద్ ఆశయాలను అమలు చేస్తున్న మోదీ ప్రభుత్వం
- 370 ఆర్టికల్ రద్దు, మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా ముఖర్జీ ఆకాంక్షలే
- దళారీ వ్యవస్థ లేకుండా లబ్దిదారులకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం



- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించిన కేంద్ర మంత్రి

**ఢిల్లీ వెలుతురు జూన్ 23:**

భారతదేశ అసలు సిసలైన హీరో శ్యామాప్రసాద్ ముఖర్జీ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభివర్ణించారు. దేశం కోసం యుద్ధం చేయడానికి సిద్దంగా ఉండాలని జన సంఘ్ కార్యకర్తలను పిలుపునివ్వడమే కాకుండా కార్యకర్తలకు తుపాకీలిచ్చి పాకిస్తాన్ పై యుద్ధం చేయడానికి పంపిన వీరుడని కొనియాడారు.

▶ మిగతా 2లో

## కేంద్ర మంత్రులను కలిసిన తుమ్మల, ఉత్తమ్

- తెలంగాణ రైతాంగ ప్రయోజనాల కోసం కేంద్రానికి వినతులు
- ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించాలి.. దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలి
- తెలంగాణకు తక్షణమే డీఏపీ, యూరియా సరఫరా చేయాలి
- పప్పుధాన్యాలు, నూనెగింజల కొనుగోలుపై 25 శాతం పరిమితి ఎత్తివేయాలి
- మొక్కజొన్న, జొన్నలను కేంద్రం MSPపై కొనుగోలు చేయాలి



2

## SIR పై అప్రమత్తంగా ఉండాలి.. BLAల పాత్ర అత్యంత కీలకం: టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**సంగుపేట్ వెలుతురు జూన్ 23:**

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియపై ప్రతి కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్ (BLA) పూర్తి అవగాహనతో పనిచేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. సంగుపేట్‌లోని శ్రీ లక్ష్మీదేవి గార్డెన్‌లో ఆందోల్ నియోజకవర్గ కాంగ్రెస్ BLAల కోసం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ హాజరయ్యారు. మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే పరిగి రామ్మోహన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు, కార్పొరేషన్ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డాక్టర్ సెల్ చైర్మన్ రాజీవ్, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, BLAలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, SIR ప్రక్రియపై తీవ్ర స్థాయిలో చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 2002లో ఓటర్ల జాబితాల ప్రక్షాళన



2

ఓట్లను చేర్చేందుకు జరిగినప్పటికీ, ప్రస్తుతం సెక్యులర్ ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆందోళన వ్యక్తం చేశారు.

ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ సంస్థగా వ్యవహరించాలని పేర్కొన్న ఆయన, ఒకప్పుడు టి.ఎన్. శేషన్ నాయకత్వంలో ఎన్నికల సంఘం అంటే ప్రతి ఒక్కరికీ గౌరవంతో పాటు భయం కూడా ఉండేదని గుర్తు చేశారు. ప్రస్తుతం ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు నమోదు అయ్యేలా పార్టీ నాయకులు, BLAలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

▶ మిగతా 2లో

## ఉపాధి హామీ అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- అధికారులకు మంత్రి సీతక్క సూచనలు.. గ్రామీణాభివృద్ధి పనులపై సమీక్ష
- తాగునీటి సరఫరాపై అధికారులకు ఆదేశాలు
- మహిళా సంఘాల బలోపేతంపై దృష్టి
- గ్రామీణ రహదారుల పురోగతిపై సమీక్ష
- స్వచ్ఛభారత్ లక్ష్యాల సాధనకు సూచనలు
- 'జలసిరి' పోస్టర్లను ఆవిష్కరించిన మంత్రి



4

**హైదరాబాద్ వెలుతురు జూన్ 23:**

గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల పనితీరుపై రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశాన్ని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క నిర్వహించారు. మంగళవారం జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో జరిగిన ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీఆర్‌డీఓలు, డీపీఓలు పాల్గొన్నారు. జిల్లాల వారీగా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, పెండింగ్ అంశాలపై మంత్రి సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.

హామీ పథకం అమలు, కూలీలకు పనిదినాల కల్పన, పెండింగ్‌లో ఉన్న మెటీరియల్ బిల్లుల చెల్లింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ భవనాలు, మహిళా శక్తి భవనాలు, గ్రామపంచాయతీ కార్యాలయాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. జల సంరక్షణ పనులు, చెక్‌డ్యాంల నిర్మాణం, ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన (పీఎమ్‌కేఎస్‌వై) పనుల పురోగతిపైనా సమీక్ష నిర్వహించారు.

# పార్టీ విరాళాల పేరుతో డీఎంకే అవినీతి

- ముఖ్యమంత్రి విజయ్ ఆరోపణ
- అసెంబ్లీలో సీఎం విజయ్, డీఎంకే మధ్య వాగ్వాదం
- ప్రసంగంపై చర్చలో గందరగోళం
- సీఎం ప్రసంగానికి నిరసనగా డీఎంకే వాకౌట్
- డీఎంకేపై విజయ్ తీవ్ర ఆరోపణలు
- స్టాలిన్ మేనరిజాన్ని అనుకరించిన సీఎం అధికార పక్ష సభ్యుల చప్పట్లు
- శాంతిభద్రతలపై ప్రతిపక్ష విమర్శల ఖండన
- మహిళల భద్రతకు ప్రాధాన్యమన్న ప్రభుత్వం



**చెన్నై వెలుతురు జూన్ 23:**

తమిళనాడు శాసనసభ మంగళవారం తీవ్ర వాదోపవాదాలు, నాటకీయ పరిణామాల మధ్య అట్టుడికింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి విజయ్, ప్రధాన ప్రతిపక్షమైన డీఎంకే సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం జరిగింది.

▶ మిగతా 2లో

# ఖట్టర్‌తో సీఎం రేవంత్, కిషన్‌రెడ్డి కీలక భేటీ...

**(మొదటి పేజీ తరువాయి)**

ఢిల్లీలోని ఖట్టర్ అధికారిక నివాసంలో జరిగిన ఈ భేటీలో హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణతో పాటు రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులపై విస్తృతంగా చర్చించారు.సమావేశంలో ప్రధానంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్–2 విస్తరణకు కేంద్ర సహకారం, ప్రాజెక్టుకు అవసరమైన నిధుల సమీకరణ, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) ద్వారా రుణం సమకూర్చే అవకాశాలపై సుదీర్ఘంగా మంతనాలు జరిగినట్లు సమాచారం. ప్రాజెక్టు అమలును వేగవంతం చేసే అంశాలపై కూడా చర్చించినట్లు తెలిసింది.మంగళవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమావేశమైన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా కూడా ఐఆర్ఎఫ్‌సీ రుణం, మెట్రో ప్రాజెక్టుకు అవసరమైన ఆర్థిక సహకారంపై చర్చించారు. ఆ సమావేశానికి కొనసాగింపుగానే బుధవారం ఖట్టర్‌తో జరిగిన భేటీలో అశ్వినీ వైష్ణవ్ కూడా పాల్గొన్నారు.హైదరాబాద్ మెట్రో రెండో దశతో పాటు తెలంగాణలో చేపడుతున్న ఇతర మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అందాల్సిన సహకారం, నిధుల విడుదల, కేంద్ర–రాష్ట్ర సమన్వయంపై సమావేశంలో చర్చించినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టుల పురోగతిపై కూడా సమీక్ష నిర్వహించినట్లు తెలుస్తోంది.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న మెట్రో రెండో దశ ప్రాజెక్టుకు కేంద్ర సహకారం లభించే దిశగా వరుసగా జరుగుతున్న ఈ సమావేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సమావేశం అనంతరం అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ, ప్రాజెక్టులకు సంబంధించిన కీలక అంశాలపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

# మోడీ కేబినెట్ విస్తరణ వేళ సంచలనం

- **మోడీ కేబినెట్‌లోని ఏకైక క్రైస్తవ ముఖం జార్జ్ కురియన్**
- **సుప్రీంకోర్టు న్యాయవాది నుంచి కేంద్ర మంత్రి వరకు ప్రస్థానం**
- **కొత్త ఎంపీలకు చోటు కల్పించేందుకే హైకమాండ్ వ్యూహం**

**ఢిల్లీ వెలుతురు జూన్ 23:**

దేశ రాజధాని ఢిల్లీ రాజకీయాల్లో ఒక్కసారిగా పెను సంచలనం నమోదైంది. ప్రధాని నరేంద్ర మోడీ తన కేంద్ర కేబినెట్ ప్రక్షాళన, విస్తరణపై తీవ్రంగా దృష్టి సారించిన తరుణంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి జార్జ్ కురియన్ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన సమర్పించిన రాజీనామా పత్రాన్ని ప్రధాని మోడీ సూచన మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వెంటనే ఆమోదించారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్రపతి భవన్ అధికారిక ప్రకటన విడుదల చేస్తూ ఈ విషయాన్ని ధృవీకరించింది. కేంద్ర కేబినెట్‌లో త్వరలోనే భారీ మార్పులు, చేర్పులు జరగనున్నాయనే ప్రచారానికి ఈ రాజీనామా మరింత బలాన్ని చేకూర్చింది.గత కొన్ని రోజులుగా కేంద్ర ప్రభుత్వ వర్గాల్లో కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై జోరుగా చర్చ సాగుతోంది. ప్రధాని నరేంద్ర మోడీ తన ప్రస్తుత మంత్రివర్గంలో పనితీరు సరిగా లేని కొందరికి ఉద్వాసన పలకాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. వారి స్థానంలో కొత్తగా ఎన్నికైన ఎంపీలకు, యువకులకు చోటు కల్పించాలనే యోచనతో మోడీ ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే మంత్రుల పనితీరుపై అధిష్టానం ఒక స్పష్టమైన వడపోత కార్యక్రమాన్ని (స్క్రీనింగ్) పూర్తి చేసిందని, అందులో భాగంగానే ఈ మార్పులు మొదలయ్యాయని రాజకీయ వర్గాలు అంటున్నాయి.కేంద్ర కేబినెట్ మార్పుల్లో భాగంగా ఇద్దరు కీలక కేంద్రమంత్రుల రాజ్యసభ పదవీకాలం ముగిసినప్పటికీ, బిజెపి అధిష్టానం వారిని తిరిగి నామినేట్ చేయడానికి ఆసక్తి చూపలేదు. సభలో స్థానం లేని పక్షంలో ఆరు నెలల కంటే ఎక్కువ కాలం మంత్రిగా కొనసాగే అవకాశం లేకపోవడంతో, వారికి ఉద్వాసన తప్పదనే సంకేతాలు ముందే వచ్చాయి. ఈ క్రమంలోనే జార్జ్ కురియన్ తన పదవిని వదులుకోవాల్సి వచ్చింది. పార్టీ పెద్దల నుంచి వచ్చిన స్పష్టమైన ఆదేశాల మేరకే ఆయన తన పదవికి రాజీనామా సమర్పించారు.ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని మూడవ దఫా (మోడీ 3.0) ప్రభుత్వంలో క్రైస్తవ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం వహించిన ఏకైక మంత్రి జార్జ్ కురియన్ కావడం విశేషం. ఆయన కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించడంతో పాటు.. మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖకు కూడా సహాయ మంత్రిగా (రాష్ట్ర మంత్రి) సేవలందించారు. కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీని బలోపేతం చేసే వ్యూహంలో భాగంగా మోడీ ఆయనకు తన కేబినెట్‌లో కీలక స్థానం కల్పించారు.జార్జ్ కురియన్ రాజ్యసభ సభ్యత్వం ఈనెల 21తో అధికారికంగా ముగిసింది. ఉప ఎన్నికల ద్వారా ఎన్నికైన ఆయన పదవీకాలం ముగియడంతో, తిరిగి ఆయనను ఎగువ సభకు పంపేందుకు పార్టీ నాయకత్వం మొగ్గు చూపలేదు. కొత్త ముఖాలకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో ఆయనకు మళ్లీ రాజ్యసభ టికెట్ నిరాకరించారు. పార్లమెంట్ సభ్యత్వం లేకపోవడంతో నైతిక బాధ్యతగా, నిబంధనల ప్రకారం ఆయన మంగళవారం తన మంత్రి పదవికి రాజీనామా చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది.కేరళలోని కొట్టాయం జిల్లాకు చెందిన జార్జ్ కురియన్ నేపథ్యం ఎంతో నిబద్ధతతో కూడుకున్నది. ఆయన వృత్తిరీత్యా సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాదిగా పనిచేశారు. చట్టాలపై ఉన్న పట్టుతో పాటు మైనారిటీల సమస్యలపై ఆయనకు మంచి అవగాహన ఉంది. గతంలో ఆయన జాతీయ మైనారిటీల కమిషన్ ఉపాధ్యక్షుడిగా కూడా దేశానికి సేవలందించారు. ఆ సమయంలో దేశంలోని వివిధ మైనారిటీ వర్గాల సంక్షేమం కోసం ఆయన తీసుకున్న నిర్ణయాలు పార్టీ అధిష్టానం దృష్టిని ఆకర్షించాయి.జార్జ్ కురియన్ కేవలం పదవుల కోసమే కాకుండా, సిద్ధాంతాల కోసం పనిచేసే నాయకుడిగా గుర్తింపు పొందారు. బిజెపి ఆవిర్భవించిన నాటి నుంచి అంటే 1980 వ సంవత్సరం నుంచే ఆయన భారతీయ జనతా పార్టీలో క్రియాశీలక సభ్యుడిగా కొనసాగుతున్నారు. కేరళలో కమల దళం ఉనికి చాటడం ఎంతో కష్టంగా ఉన్న రోజుల్లో కూడా ఆయన పార్టీ జెండాను మోశారు. దశాబ్దాలుగా పార్టీకి నమ్మకమైన సైనికుడిగా పనిచేసినందుకే ఆయనను జాతీయ స్థాయి పదవులు వరించాయి.కేరళకు చెందిన నాయకుడైనప్పటికీ, జార్జ్ కురియన్‌ను ఢిల్లీ పెద్దలు పెద్దల సభకు పంపేందుకు వేరే మార్గాన్ని ఎంచుకున్నారు. 2024 లో జరిగిన ఉప ఎన్నికల సమయంలో మధ్యప్రదేశ్ రాష్ట్రం నుండి ఆయనను రాజ్యసభ అభ్యర్థిగా బరిలోకి దించి గెలిపించారు. ఆ తర్వాత 2024 జూన్ నెలలో ప్రధాని నరేంద్ర మోడీ మూడవసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో కురియన్‌ను తన మంత్రివర్గంలోకి తీసుకుని కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు అప్పగించారు.కురియన్ రాజీనామాతో మోడీ కేబినెట్‌లో తదుపరి రాబోయే మార్పులపై ఉత్కంఠ నెలకొంది. రాబోయే రోజుల్లో మరికొందరు మంత్రులు కూడా తమ పదవులను కోల్పోయే అవకాశం ఉందని ఢిల్లీ వర్గాలు చెప్తున్నాయి. ఉత్తర ప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర వంటి కీలక రాష్ట్రాల నుంచి కొత్తగా ఎన్నికైన ఎంపీలకు మంత్రివర్గంలో ప్రాధాన్యత ఇవ్వడానికే అధిష్టానం ఈ కఠిన నిర్ణయాలు తీసుకుంటోందని స్పష్టమవుతోంది. త్వరలోనే కొత్త మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉండవచ్చని తెలుస్తోంది.

# భారతదేశ అసలు సిసలైన...



**(మొదటి పేజీ తరువాయి)**

పార్టీ, వ్యక్తులు, రాజకీయాల కంటే దేశమే ఫస్ట్ అని చాటి చెప్పిన గొప్ప నేత శ్యామాప్రసాద్ ముఖర్జీ అని, దేశం కోసం ఆత్మ బలిదానం చేసుకున్న ఏకైక జాతీయ పార్టీ అధ్యక్షులు, పార్లమెంట్ లో ఏకైక ప్రతిపక్ష నేత కూడా ఆయనేనని తెలిపారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆలోచనలను, ఆశయాలను, ఆకాంక్షలను బీజేపీ తూ.చ తప్పకుండా అమలు చేస్తోందని తెలిపారు. ముఖర్జీ ఆకాంక్షలకు అనుగుణంగా వాజ్ పేయి ప్రభుత్వం అణ్వాయుధాలను సమకూరిస్తే... 370 ఆర్టికల్ ను రద్దు చేసి శ్యామా ప్రసాద్ ముఖర్జీ కలను నరేంద్రమోదీ నెరవేర్చారని పేర్కొన్నారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మంగళవారం రోజున న్యూఢిల్లీలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం దేశం కోసం, పార్టీ కోసం ముఖర్జీ చేసిన త్యాగాలను కొనియాడుతూ ఒక ప్రకటన విడుదల చేశారు.. ఆ ప్రకటనలోని ముఖ్యాంశాలు...భారతదేశ అసలు సిసలైన హీరో శ్యామాప్రసాద్ ముఖర్జీ. దేశం కోసం యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉండాలని జన సంఘ్ కార్యకర్తలను పిలుపునివ్వడమే కాకుండా కార్యకర్తలకు తుపాకీలిచ్చి పాకిస్తాన్ పై యుద్ధం చేయడానికి పంపిన వీరుడు. పార్టీ, రాజకీయాల కంటే దేశమే ఫస్ట్ అని చాటి చెప్పిన గొప్ప నేత శ్యామాప్రసాద్ ముఖర్జీ.

దేశం కోసం ఆత్మ బలిదానం చేసుకున్న ఏకైక జాతీయ పార్టీ అధ్యక్షులు, పార్లమెంట్ లో ఏకైక ప్రతిపక్ష నేత కూడా ఆయనే.కాశ్మీర్ వెళ్లడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పర్మిట్ కార్డు తప్పనిసరి చేస్తే నా దేశం వెళ్లడానికి పర్మిట్ కార్డు ఎందుకని ప్రశ్నిస్తూ 'ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్, దో నిషాన్ నహీ నహీ ఛలేగా...నహీ ఛలేగా' అంటూ 370 ఆర్టికల్ రద్దు కోసం పోరాడిన మహనీయుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ. ఆనాడు పర్మిట్ అవసరం లేదని పేర్కొంటూ కశ్మీర్ బయలుదేరిన శ్యామా ప్రసాద్ ముఖర్జీని నాటి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసి కనీస సౌకర్యాలు లేని జైల్లో నిర్బంధానికి గురి చేసింది. ఆనాడు అటువైపుగా వెళుతున్న నాటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ముఖర్జీని పరామర్శించాలని సోయి లేకుండా వెళ్లిపోయారు. ఆ నిర్బంధంలోనే అనుమానాస్పద స్థితిలో ముఖర్జీ మరణిస్తే కనీసం విచారణ జరపని అమానవీయ ప్రభుత్వం కాంగ్రెస్ ది. ఆయన చనిపోయాక కాశ్మీర్ కు వెళ్లడానికి వీసా తప్పనిసరి అనే విధానాన్ని నెహ్రూ ప్రభుత్వం రద్దు చేసింది. ఇది బీజేపీ సాధించిన తొలి విజయం.స్వతంత్ర ఫలాలు అట్టడుగు స్థాయి వరకు తీసుకెళ్లాలని పార్లమెంట్ లో పోరాడితే... డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సైతం శ్యామాప్రసాద్ కు మద్దతు తెలిపారంటే ఆయన గొప్పతనం, కమిట్ మెంట్ ను అర్థం చేసుకోవచ్చు.ఆనాడు పార్లమెంట్ లో నెహ్రూ మాట్లాడుతూ 'నీ పార్టీ ఎంత? నువ్వెంత? నీ పార్టీని మొత్తం నాశనం చేస్తా'నని చెబితే.... అందుకు ప్రతిగా నా పార్టీని నాశనం చేయడం సంగతి తరువాత...''నాశనం చేస్తాననే మీ ఆలోచననే నాశనం చేస్తా''నంటూ ధీటుగా బదులిచ్చిన నాయకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ.

శ్యామాప్రసాద్ ఆశయాలను బీజేపీ తూ.చ తప్పకుండా అమలు చేస్తోంది. భారతదేశ రక్షణ కోసం అణ్వస్త్రాలు ఉండాలనే ముఖర్జీ ఆకాంక్షిస్తే.... అటల్ బిహారీ వాజ్ పేయి నెరవేర్చారు. 370 ఆర్టికల్ ను రద్దు చేసి కాశ్మీర్ భారత్ లో అంతర్భాగమేనని తుది శ్వాస వరకు పోరాడిన శ్యామాప్రసాద్ కలను మోదీ నెరవేర్చారు. దేశ స్వాలంబన కోసం శ్యామా ప్రసాద్ ముఖర్జీ పరితపిస్తే మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా పేరుతో దేశం స్వయం సమృద్ధి సాధించేలా ఆచరణలోకి తీసుకొచ్చిన మహనీయుడు నరేంద్రమోదీ అని తెలిపారు. దేశ విభజన సమయంలో అనుకోని పరిస్థితుల్లో మాతృభూమికి తిరిగి వస్తే పౌరసత్వ సవరణ బిల్లును తీసుకొచ్చిన ప్రభుత్వం మోదీదే శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆశయాల మేరకు మధ్య దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వ ఫలాలను నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్న ప్రభుత్వం నరేంద్రమోదీదే''అని కొనియాడారు. ఆ మహనీయుడి ఆశయాలు, ఆకాంక్షలను అమలు చేయడమే ఆయనకు అందిస్తున్న ఘనమైన నివాళి.

# కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు సహకరించండి

- **పర్యాటకం, ఆర్థికాభివృద్ధికి ఎయిర్‌పోర్టు అవసరమన్న మంత్రి**
- **కేంద్ర సహకారం కోరిన తెలంగాణ ప్రభుత్వం**

**న్యూఢిల్లీ వెలుతురు జూన్ 23:**

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణంపై చర్చించారు. కొత్తగూడెం వద్ద గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం గతంలో చేసిన ప్రతిపాదనపై వెంటనే స్పందించి, సివిల్ ఏవియేషన్ శాఖ ద్వారా ఫీజిబులిటీ సర్వే నిర్వహించినందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు.

అయితే ఆ సర్వేలో ప్రతిపాదిత స్థలం విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేదని తేలడంతో, రాష్ట్ర ప్రభుత్వం మరో ప్రత్యామ్నాయ స్థలాన్ని ప్రతిపాదించినట్లు వివరించారు.

కొత్తగా ప్రతిపాదించిన స్థలంలో వీలైనంత త్వరగా ఫీజిబులిటీ సర్వే నిర్వహించి, గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రిని తుమ్మల కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక క్షేత్రమని, దక్షిణ అయోధ్యగా గుర్తింపు పొందిన

ఈ పుణ్యక్షేత్రానికి దేశ విదేశాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారని తుమ్మల వివరించారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటు వల్ల భద్రాచలంతో పాటు మొత్తం ప్రాంత అభివృద్ధికి, పర్యాటక రంగానికి, పారిశ్రామిక ప్రగతికి ఊతమిస్తుందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

సమావేశంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు సంబంధించిన తదుపరి చర్యలు, కేంద్ర–రాష్ట్ర సమన్వయం, సాంకేతిక అంశాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం.

# పార్టీ విరాళాల పేరుతో...



ముఖ్యమంత్రి ప్రసంగానికి నిరసనగా డీఎంకే సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.సభలో ప్రసంగించిన ముఖ్యమంత్రి విజయ్.. డీఎంకే పార్టీ పేరుతో అక్రమంగా నిధులు సేకరిస్తోందని ఆరోపించారు. అవినీతికి పాల్పడిన వారిని తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమైనవేనని విమర్శించారు.ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు డీఎంకే సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ పదేపదే అడ్డుతగిలారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. స్పీకర్ పలుమార్లు సభ్యులను శాంతించాలని కోరినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో డీఎంకే సభ్యులు నినాదాలు చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు.ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎం.కె. స్టాలిన్‌ను విజయ్ అనుకరించడం సభలో ప్రత్యేక ఆకర్షణగా మారింది. గతంలో సీట్ల పంపకాల చర్చల సందర్భంగా స్టాలిన్ ప్రదర్శించిన మేనరిజాన్ని విజయ్ సభలో అనుకరించి చూపించడంతో అధికార పక్ష సభ్యులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు.అదే ప్రసంగంలో తమ ప్రభుత్వం సీపీఎం, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్‌తో పొత్తు పెట్టుకోవడాన్ని విజయ్ సమర్థించుకున్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మహిళల భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలన విషయంలో తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.కాగా, అధికార పక్షం, ప్రతిపక్షం మధ్య తీవ్ర వాగ్వాదంతో మంగళవారం శాసనసభ సమావేశాలు రాజకీయ వేడిని సంతరించుకున్నాయి

# SIR పై అప్రమత్తంగా ఉండాలి..

## BLAల పాత్ర అత్యంత కీలకం: టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

ఒక్క ఓటు కూడా ప్రభుత్వాలను గద్దె ఎక్కించే శక్తి, గద్దె దించే శక్తి కలిగి ఉంటుందని, అందుకే బూత్ స్థాయిలో BLAల పాత్ర అత్యంత కీలకమని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 70 శాతం అమలు చేసిందని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అరాచకాలను ప్రజలు ఇప్పటికీ మరిచిపోలేదని, ఆ పార్టీ రాజకీయంగా ముగింపు దశకు చేరుకుందని విమర్శించారు. రాష్ట్రంలో జరిగిన ప్రతి ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని నమోదు చేస్తోందని, మహిళల అభివృద్ధి, పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

# కేంద్ర మంత్రులను కలిసిన తుమ్మల, ఉత్తమ్

**న్యూఢిల్లీ వెలుతురు జూన్ 23:**

రాష్ట్ర ప్రయోజనాలు, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని బృందం మంగళవారం న్యూఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, రైతాంగ ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ, రైతుల ప్రయోజనాల పరిరక్షణ, దేశీయ వంటనూనెల ఉత్పత్తి పెంపుపై విస్తృతంగా చర్చించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్–ఆయిల్ పామ్ (NMEO–OP) లక్ష్యాలను అత్యంత సమర్థవంతంగా అమలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి తుమ్మల వివరించారు. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరించగా, 70 వేల మందికిపైగా రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారని తెలిపారు. రాబోయే మూడేళ్లలో ఈ విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.భారత్ ప్రస్తుతం వంటనూనెల అవసరాల్లో దాదాపు 60 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోందని, ఈ పరిస్థితిని మార్చేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన NMEO–OP కార్యక్రమం దేశ ఆర్థిక వ్యవస్థకు, రైతాంగానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. అయితే ఇటీవల క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 44 శాతం నుంచి 16 శాతానికి తగ్గించడం వల్ల దేశీయ ఆయిల్ పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.దిగుమతి సుంకం తగ్గింపుతో విదేశాల నుంచి చౌక ధరలకు పామాయిల్ దిగుమతులు పెరిగి దేశీయ మార్కెట్లో ధరలు పడిపోతున్నాయని, దీనివల్ల ఆయిల్ పామ్ రైతులు ఉత్పత్తి చేస్తున్న ఫ్రెష్ ఫ్రూట్ బంచ్ (FFB)లకు గిట్టుబాటు ధర లభించడం లేదని వివరించారు. దీర్ఘకాలిక పంట అయిన ఆయిల్ పామ్ సాగుకు రైతులు భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో ధరల అనిశ్చితి రైతుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు.దిగుమతి సుంకాన్ని తిరిగి 44 శాతానికి పెంచడం ద్వారా దేశీయ ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఆత్మనిర్భర్ భారత్, ఎడిబుల్ ఆయిల్ స్వయం సమృద్ధి లక్ష్యాలు కూడా సాధ్యమవుతాయని మంత్రులు పేర్కొన్నారు. అలాగే ఆయిల్ పామ్ రైతులకు కనీస గ్యారంటీ ధర (Minimum Guaranteed Price – MGP) విధానాన్ని అమలు చేసే అంశాన్ని కూడా కేంద్రం పరిశీలించాలని కోరారు.తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఆయిల్ పామ్ రైతుల భవిష్యత్తు దృష్ట్యా దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించి రైతులకు భరోసా కల్పించాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని మంత్రులు విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణ రైతాంగానికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతి పత్రాలు సమర్పించారు. రాష్ట్రంలో ఈ ఏడాది వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో డి.ఎ.పి, యూరియా ఎరువుల అవసరం గణనీయంగా పెరిగిందని, కేంద్రం కేటాయించిన కోటాకు మరియు వాస్తవ సరఫరాకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వెంటనే పూడ్చి, రాష్ట్రానికి పూర్తి స్థాయిలో ఎరువులు అందించాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఎరువుల సరఫరాను నిరంతరాయంగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే పప్పుధాన్యాలు, నూనెగింజల కొనుగోళ్లపై ప్రస్తుతం అమలులో ఉన్న 25 శాతం పరిమితి రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నదని పేర్కొన్నారు. రైతులు ఉత్పత్తి చేసిన మొత్తం పంటను కనీస మద్దతు ధర (MSP) కింద కొనుగోలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుని ఆ పరిమితిని పూర్తిగా తొలగించాలని కోరారు. దీంతో పప్పుధాన్యాలు, నూనెగింజల సాగుకు మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు దేశ ఆహార భద్రత, దిగుమతుల తగ్గింపుకు కూడా దోహదపడుతుందని వివరించారు.ఈ ఏడాది తెలంగాణలో రికార్డు స్థాయిలో సుమారు 15 లక్షల టన్నుల మొక్కజొన్న, 3 లక్షల టన్నుల జొన్నల ఉత్పత్తి నమోదైందని, మార్కెట్ ధరలు కనీస మద్దతు ధర కంటే దిగువకు పడిపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే భారీ ఆర్థిక భారం భరించి మొక్కజొన్న, జొన్నలను కొనుగోలు చేసిందని, ఈ పంటలను కూడా కేంద్ర ప్రభుత్వ కొనుగోలు విధానంలో చేర్చి MSPపై సేకరించాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా రసాయనాలు–ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాకు తెలంగాణలో ఎరువుల సరఫరా, పోషకాధారిత ఎరువుల సబ్సిడీ (NBS) విధానంలో మార్పులకు సంబంధించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల పలు లేఖలు రాయగా... ఈ వినతులపై స్పందించిన కేంద్ర మంత్రి తెలంగాణలో యూరియా, డి.ఎ.పి. తదితర ఎరువుల లభ్యత, సరఫరాపై కేంద్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని, రాష్ట్ర రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని శాఖ అధికారులను ఆదేశించినట్లు తన లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రస్తావించిన అంశాలపై కేంద్రం సానుకూలంగా స్పందించడం రైతాంగానికి ప్రయోజనకరంగా మారుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

ఈ సమావేశాలలో మంత్రులు తుమ్మల, ఉత్తమ్ ల వెంట ఎంపిలు రఘువీర్ మరియు కొండ విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో ఎక్సైజ్ సూపరింటెండెంట్

- **ఆదాయానికి మించిన ఆస్తుల కేసు..**
- **హైదరాబాద్‌తో పాటు 11 చోట్ల ఏకకాలంలో సోదాలు**
- **తెల్లవారుజాము నుంచే మెరుపు దాడులు**
- **హైదరాబాద్‌తో సహా బంధువుల ఇళ్లలో సోదాలు**
- **గత ఆరేళ్లుగా నిజామాబాద్‌లోనే తిష్టవేసిన మల్లారెడ్డి**
- **బ్యాంకు లావాదేవీల రికార్డులు లభ్యం.. బంగారం, నగదుపై ఆరా**
- **నిజామాబాద్ నుంచి హైదరాబాద్ ఏసీబీ ఆఫీస్‌కు తరలింపు**

**నిజామాబాదు వెలుతురు జూన్ 23:**

అవినీతి నిరోధక శాఖ అధికారులు తెలంగాణలో మరో పెద్ద అవినీతి తిమింగలాన్ని పట్టుకున్నారు. ఆదాయానికి మించిన ఆస్తులు భారీగా కూడబెట్టారనే పక్కా సమాచారంతో నిజామాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ మల్లారెడ్డి నివాసాలు, కార్యాలయాలపై ఏసీబీ అధికారులు విరుచుకుపడ్డారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు నిజామాబాద్, హైదరాబాద్ నగరాల్లోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించాయి. ఈ సోదాల్లో అక్రమ ఆస్తులకు సంబంధించిన కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్న అధికారులు, మల్లారెడ్డిని అదుపులోకి తీసుకుని నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు తరలించారు. ఈ దాడులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ అధికారుల్లో తీవ్ర కలకలం రేపాయి.నిజామాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి అవినీతి అక్రమాలపై ఏసీబీ ప్రధాన కార్యాలయానికి వరుసగా ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో నిఘా పెట్టిన అధికారులు మంగళవారం తెల్లవారుజామునే యాక్షన్ ప్లాన్ అమలు చేశారు. ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు (స్పెషల్ టీమ్స్) పలు గ్రూపులుగా విడిపోయి, మల్లారెడ్డికి సంబంధించిన ఇళ్లు, కార్యాలయాలపై ఒకేసారి మెరుపు దాడులు నిర్వహించాయి. ఆయనకు ఏమాత్రం కోలుకునే అవకాశం ఇవ్వకుండా ఈ సోదాలు జరిగాయి.నిజామాబాద్ నగరంలోని సుభాష్ నగర్ ప్రాంతంలో ఉన్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రధాన కార్యాలయంలో ఒక ఏసీబీ బృందం తనిఖీలు చేపట్టింది. అదే సమయంలో ప్రగతి నగర్‌లో మల్లారెడ్డి అద్దెకు ఉంటున్న నివాస గృహంలోనూ మరో బృందం సోదాలు ప్రారంభించింది. ఆఫీసులోని ఫైళ్లను, ఇంట్లోని బీరువాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల సమయంలో ఎక్సైజ్ శాఖకు చెందిన కొందరు సిబ్బందిని కూడా అధికారులు విచారించి వివరాలు సేకరించారు.మల్లారెడ్డి కేవలం నిజామాబాద్‌కే పరిమితం కాకుండా హైదరాబాద్‌లోనూ భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ గుర్తించింది. హైదరాబాద్‌లోని మచ్చబొల్లారంలో ఉన్న మల్లారెడ్డి సొంత నివాసంతో పాటు, ఆయనకు అత్యంత ఆప్తులైన బంధువులు, స్నేహితుల ఇళ్లల్లోనూ



దాడులు జరిగారు. నిజామాబాద్ మరియు హైదరాబాద్ నగరాల పరిధిలో మొత్తం 11 కీలక ప్రాంతాలలో ఒకే సమయంలో ఈ తనిఖీలు నిర్వహించడం గమనార్హం.ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి గత ఆరేళ్లుగా నిజామాబాద్ జిల్లాలోనే సుదీర్ఘ కాలంగా బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు ఏసీబీ అధికారులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. ఒకే ప్రాంతంలో ఇన్నేళ్లుగా పనిచేస్తుండటంతో స్థానిక మద్యం వ్యాపారులతో, బెల్ట్ షాపుల నిర్వాహకులతో ఆయనకు బలమైన సంబంధాలు ఏర్పడ్డాయని సమాచారం. ఈ సుదీర్ఘ కాలంలోనే ఆయన భారీగా మామూళ్లు వసూలు చేసి కోట్లాది రూపాయల అక్రమ ఆస్తులను వెనకేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.నిజామాబాద్ ఎక్సైజ్ కార్యాలయంలో జరిపిన సోదాల్లో ఏసీబీ అధికారులకు కొన్ని అత్యంత కీలకమైన ప్రభుత్వ డాక్యుమెంట్లు, ప్రైవేట్ రికార్డులు లభ్యమయ్యాయి. మల్లారెడ్డి వ్యక్తిగత లావాదేవీలకు సంబంధించిన కొన్ని డైరీలను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. వీటితో పాటు ఆయన నివాసంలో దొరికిన పలు భూముల రిజిస్ట్రేషన్ కాపీలు, ఇతర విలువైన వస్తువులను ఏసీబీ బృందం తమ వశం చేసుకుంది.సోదాల సమయంలో మల్లారెడ్డికి సంబంధించిన వివిధ బ్యాంక్ అకౌంట్ల వివరాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పెద్ద ఎత్తున జరిగిన బ్యాంక్ ట్రాన్సాక్షన్లకు (ఆర్థిక లావాదేవీలు) సంబంధించిన పత్రాలను అధికారులు గుర్తించారు. అయితే, ఈ 11 ప్రాంతాల సోదాల్లో మొత్తం ఎంత నగదు దొరికింది? ఎన్ని కిలోల బంగారం, వెండి లేదా వజ్రాల ఆభరణాలు లభించాయి? అనే పూర్తి వివరాలను ఏసీబీ ఉన్నతాధికారులు ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో గట్టి ఆధారాలు లభించడంతో నిజామాబాద్‌లో ఉన్న మల్లారెడ్డిని ఏసీబీ అధికారులు అధికారికంగా అదుపులోకి తీసుకున్నారు. స్థానికంగా విచారిస్తే ఇబ్బందులు ఎదురవుతాయనే ఉద్దేశంతో, ఆయనను ప్రత్యేక వాహనంలో నిజామాబాద్ నుండి హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయానికి తరలించారు. అక్కడ ఉన్నతాధికారుల సమక్షంలో ఆయనను ముఖాముఖి కూర్చోబెట్టి మరిన్ని వివరాలు రాబట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.ఇటీవలి కాలంలో తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ తన వేగాన్ని అమాంతం పెంచింది. అక్రమంగా కోట్లు కూడబెడుతూ, సామాన్య ప్రజలను పీడించే ప్రభుత్వ అధికారుల ఆట కట్టిస్తోంది. ఎంతటి పెద్ద హోదాలో ఉన్న అధికారి అయినా సరే.. పక్కా ఆధారాలు దొరికితే చాలు జైలుకు పంపుతోంది. వరుసగా పెద్ద పెద్ద అధికారులు ఏసీబీ దాడుల్లో అడ్డంగా దొరికిపోతుండటంతో, లంచాలు తీసుకునే ఇతర అవినీతి అధికారుల గుండెల్లో ఇప్పుడు వణుకు మొదలైంది.

# తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారు

- **ఉద్యమకారుల గుర్తింపులో వారికి ప్రాధాన్యత ఇవ్వాలి**
- **చైర్మన్ కేకే కు వినతి పత్రాన్ని అందించిన టీయుడబ్ల్యూజే**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 23:**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన చారిత్రాత్మక మహా ఉద్యమంలో, క్రియాశీలక పాత్రను పోషించిన జర్నలిస్టులను ఉద్యమకారులుగా గుర్తించి, వారి సేవలకు, త్యాగానికి తగిన గౌరవం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యూజే) ప్రభుత్వాన్ని కోరింది.మంగళవారం నాడు టీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం, తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కె. కేశవ రావును బంజారా హిల్స్ లోని ఆయన నివాసంలో సమావేశమై వినతి పత్రాన్ని అందించింది. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ, ఉద్యమ సమయంలో జర్నలిస్టులు కేవలం వార్తలను సేకరించి ప్రచారం చేసే బాధ్యతకే పరిమితం కాలేదని, తెలంగాణ ప్రజల ఆకాంక్షను, ఆవేదనను, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి తెలియజేస్తూనే, ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను, వాస్తవాలను ప్రజలకు చేరవేసి ఉద్యమానికి నైతిక బలం చేకూర్చడం వంటి కీలక బాధ్యతలను నిర్వర్తించారని ఆయన అన్నారు. అంతేకాకుండా తెలంగాణ ప్రాంత ప్రజలు ఎదుర్కొన్న వివక్షను, సామాజిక-ఆర్థిక అసమానతలను, ప్రాంతీయ అన్యాయాలను దేశవ్యాప్తంగా చర్చకు తీసుకువచ్చారన్నారు. అనేక ప్రాంతాల్లో జర్నలిస్టులు ఉద్యమకారులతో కలిసి ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారని, పలుచోట్ల ఉద్యమ జాయింట్ యాక్షన్ కమిటీలకు నాయకత్వం వహించారని ఆయన గుర్తుచేసారు.



ఉద్యమ సమయంలో పోలీసులు జర్నలిస్టులపై లాఠీచార్జీలు జరిపిన సంఘటనలు ఎన్నో చోట్ల చోటుచేసుకున్నాయని, ఉద్యమానికి కేంద్రంగా ఉన్న ఉస్మానియా యూనివర్సిటీతో పాటు పలు చోట్ల పోలీసులు కెమెరాలను ధ్వంసం చేయడం, వార్తా సేకరణను అడ్డుకోవడం, జర్నలిస్టులపై తప్పుడు కేసులు నమోదు చేయడం, బెదిరింపులకు పాల్పడడం, గాయపర్చడం వంటి అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. అయినప్పటికీ విధినిర్వహణలో జర్నలిస్టులు వెనుకడుగు వేయలేదని, తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఉద్యమాన్ని ప్రపంచానికి చాటిచెప్పే బాధ్యతను నిర్వర్తించారన్నారు. అలాగే ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నందుకు పలువురు జర్నలిస్టులు తమ ఉద్యోగాలను కూడా కోల్పోయారని, కొందరు యాజమాన్యాల ఒత్తిళ్లను ఎదుర్కొన్నారని, మరికొందరు తెలంగాణ ఉద్యమానికి మద్దతు ఇచ్చినందుకు ఉద్యోగాలకు రాజీనామా చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, అయినా వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి తెలంగాణ సమాజం కోసం తమ జీవితాలను అంకితం చేశారని విరాహత్ తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఎంపిక కమిటీ ఈ అంశాన్ని సానుభూతితో పరిశీలించి, ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొని సేవలందించిన జర్నలిస్టులకు ఉద్యమకారులుగా గుర్తింపు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.తెలంగాణ ఉద్యమ చరిత్రలో జర్నలిస్టుల సేవలు, త్యాగాలు చిరస్థాయిగా నిలిచేలా కమిటీ న్యాయమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన అభ్యర్థించారు. కమిటీ చైర్మన్ కేకే ను కలిసిన వారిలో విరాహత్ అలీతో పాటు టీయుడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. యాదగిరి, రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ. రాజేష్, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (HUJ) అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

**సమగ్రంగా అధ్యయనం చేసి న్యాయం చేస్తాం: కే. కేశవరావు**

తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియ ప్రారంభం అయ్యిందని, రాజకీయ, రాజకీయేతర రంగాలతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు కమిటీ చైర్మన్ కె. కేశవరావు టీయుడబ్ల్యూజే బృందంతో తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఆయా కోణాల్లో సమగ్ర సమాచారాన్ని సేకరించేందుకు కసరత్తు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేసారు. ఉద్యమ సాక్ష్యాలను పరిగణలోకి తీసుకొని, ఆయా రంగాల ఉద్యమకారులను గుర్తించనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తో పాటు ఆయా జిల్లాల నుండి సేకరించిన సమాచార నివేదికలు, ఆయా వర్గాలతో ప్రత్యేక సంప్రదింపులు నిర్వహించి, ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో సీనియర్ పాత్రికేయులతో కూడా కమిటీ సమావేశమై వారి సలహాలు కూడా తీసుకుంటుందని కేశవరావు అన్నారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ





- **రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

**అందోల్ వెలుతురు జూన్ 23:**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) పై సంగుపేట చౌరస్తాలోని లక్ష్మీదేవి గార్డెన్ లో నిర్వహించిన అందోల్ నియోజక వర్గ బూత్ లెవెల్ ఏజెంట్స్ (BLA) లతో అవగాహన, శిక్షణ శిబిరం లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్, రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ లు పాల్గొన్నారు.ఈ సమావేశం లో SIR పై మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ గారు BLA లకు పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటర్ గా నమోదు చేయాలన్నారు. ఓటర్ల జాబితా లో తప్పుల సవరణ కు కృషి చేయాలన్నారు. ఓటర్ తన ఓటు హక్కు ను కలిగి ఉండేలా చైతన్యాన్ని పెంపొందించాలన్నారు. SIR పై ప్రజా ప్రతినిధులు, ప్రతి ఒక్క బూత్ లెవెల్ ఏజెంట్స్ అవగాహన కలిగి ఉండాలన్నారు. SIR యొక్క ముఖ్య ఉద్దేశం పై అవగాహన కల్పించారు.ఈ సమావేశం లో ఎంపీ సురేష్ షెట్కర్, ఏమ్మెల్యే డా. సంజీవ రెడ్డి. డీసీసీ ప్రెసిడెంట్. TGIIC చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, కాటా శ్రీనివాస్ గౌడ్ . ముఖ్య నాయకులు తపాల్గొన్నారు

# ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్-వామపక్షాల భారీ నిరసన




- **SIR ఉపసంహరణకు డిమాండ్**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 23:**

హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం నుండి BRK భవన్ వరకు కాంగ్రెస్ పార్టీ, సీపీఐ, టీజేఎస్ మరియు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ నిరసన ర్యాలీలో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డా. మల్లు రవి పాల్గొన్నారు.ఈ సందర్భంగా డా. మల్లు రవి మాట్లాడుతూ, SIR పేరుతో బీజేపీ ప్రభుత్వం ప్రజల రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును హరించే ప్రయత్నం చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. పేదలు, దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాల ఓటర్లను జాబితాల నుంచి తొలగించే చర్యలు ప్రజాస్వామ్యంపై దాడితో సమానమని పేర్కొన్నారు.అనంతరం రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులకు వినతిపత్రం అందజేసి, SIR ప్రక్రియను తక్షణమే ఉపసంహరించుకొని ప్రతి పౌరుడి ఓటు హక్కుకు పూర్తి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో హరగోపాల్, ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిత్ ముదిరాజ్, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి, వివిధ రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణ లక్ష్యాలు పెంచండి

- **కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ**
- **రికార్డు స్థాయిలో 80.09 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ**
- **తక్కువ లక్ష్యాల వల్ల రాష్ట్ర ఖజానాపై భారీ ఆర్థిక భారం**
- **లక్ష్యాలకు మించి అదనంగా కొనుగోలు.. రూ.16,446 కోట్ల భారం**
- **నిల్వ స్థలాల కొరతతో సీఎంఆర్ గడువు పొడిగింపు అత్యవసరం**

**న్యూఢిల్లీ వెలుతురు జూన్ 23:**

తెలంగాణ రైతుల ప్రయోజనాలను పరిరక్షించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుత రబీ 2025-26 సీజన్‌లో రికార్డు స్థాయిలో వరి కొనుగోళ్లు జరిగిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా కేంద్రం తన ధాన్య సేకరణ లక్ష్యాలను పెంచాలని, అలాగే కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్) సరఫరా గడువులను పొడిగించాలని విజ్ఞప్తి చేస్తూ కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ఆయన ఒక లేఖ రాశారు. మంగళవారం కొత్త ఢిల్లీలో సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర మంత్రిని స్వయంగా కలిసి ఈ వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం దిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ఇస్తూ ఒక్క గింజ కూడా నష్టపోకుండా కొనుగోలు చేస్తోందని వివరించారు.దేశంలోనే మరే రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుత రబీ సీజన్‌లో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 80.09 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు ప్రక్రియ ఇంకా విజయవంతంగా కొనసాగుతోందన్నారు. 2025-26 మార్కెటింగ్ సంవత్సరానికి గాను ఖరీఫ్, రబీ సీజన్లను కలిపి చూస్తే తెలంగాణలో ఏకంగా 152 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వరి సేకరణ జరిగిందని, ఇది రాష్ట్ర చరిత్రలోనే ఒక అద్భుతమైన చారిత్రాత్మక రికార్డు అని ఆయన సగర్వంగా ప్రకటించారు.రాష్ట్ర ప్రభుత్వం పంపిన వరి ఉత్పత్తి అంచనాలకు భిన్నంగా కేంద్ర ప్రభుత్వం కొనుగోలు లక్ష్యాలను చాలా తక్కువగా నిర్ధారించడం వల్ల తెలంగాణపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని మంత్రి ఉత్తమ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత రబీ సీజన్‌కు గాను రాష్ట్ర ప్రభుత్వం 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి సేకరణ జరుగుతుందని ముందే అంచనాలు సమర్పించిందన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం కేవలం 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించడమే లక్ష్యంగా పెట్టుకుందని, ఇది కేవలం 51.47 లక్షల మెట్రిక్ టన్నుల వరికి మాత్రమే సమానమని మంత్రి తప్పుబట్టారు. కేంద్రం చేతులెత్తేసినా రైతుల కోసం తామే కొనుగోళ్లు జరిపామన్నారు.గడిచిన మూడు సీజన్లను పరిశీలిస్తే కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన పరిమితుల కంటే చాలా ఎక్కువగా తెలంగాణ ప్రభుత్వం 69.50 లక్షల మెట్రిక్ టన్నుల వరిని అదనంగా కొనుగోలు చేయాల్సి వచ్చిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ఈ అదనపు కొనుగోళ్ల వల్ల రాష్ట్ర ఖజానాపై ఏకంగా రూ. 16,446 కోట్ల అదనపు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) భారం పడిందని స్పష్టం చేశారు. అయినప్పటికీ అన్నదాతలకు నష్టం జరగకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఈ భారాన్ని భరించిందని చెప్పారు.

రాష్ట్రంలో తీవ్రమైన ఎండల తీవ్రత, ధాన్యం మార్కెట్లలో హమాలీల కొరత, గిడ్డంగుల్లో నిల్వ సామర్థ్య సమస్యలు, ఒకేసారి భారీగా తరలివచ్చిన వరి కుప్పలు, అకాల వర్షాలు వంటి ఎన్నో ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ ప్రభుత్వం ఎక్కడా వెనుకడుగు వేయలేదని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. రైతుల నుంచి వచ్చిన ప్రతి గింజను తుచ తప్పకుండా కొనుగోలు చేశామని, తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, రైతుల వ్యక్తిగత ఆదాయాన్ని కాపాడటంలో తెలంగాణ పౌర సరఫరాల శాఖ పూర్తి విజయం సాధించిందని ఆయన కొనియాడారు.కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్) సరఫరా అంశంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర మంత్రి దృష్టికి కొన్ని కీలక సాంకేతిక ఇబ్బందులను తీసుకెళ్లారు. గత రబీ 2024-25 సీజన్‌కు సంబంధించి ఇంకా 5 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం, అలాగే ఖరీఫ్ 2025-26కు సంబంధించి 14.24 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కేంద్ర పూల్‌కు సరఫరా చేయాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో నిల్వ స్థలాల కొరత ఉండటం, ఒకేసారి పలు సీజన్ల కొనుగోళ్లు జరగడం వల్ల మిల్లింగ్



సామర్థ్యాలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోందని, అందుకే గడువులను పొడిగించక తప్పని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.రాష్ట్రంలోని మిల్లింగ్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రబీ 2024-25 సీఎంఆర్ సరఫరా గడువును మరో 60 రోజులు, అలాగే ఖరీఫ్ 2025-26 గడువును 120 రోజుల పాటు పొడిగించాలని కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. దీనితో పాటు ప్రస్తుత రబీ 2025-26 సేకరణ లక్ష్యాన్ని 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం నుండి ఏకంగా 54.50 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యానికి పెంచాలని డిమాండ్ చేశారు. అంటే తాము సేకరించిన 80.09 లక్షల మెట్రిక్ టన్నుల వరికి సమానమైన బియ్యాన్ని కేంద్రం సేకరించాలని కోరారు.తెలంగాణలో రబీ సీజన్ వాతావరణ పరిస్థితుల కారణంగా పండే వరి ఎక్కువగా ఉప్పుడు బియ్యం (బాయిల్డ్ రైస్) తయారీకి మాత్రమే అనుకూలంగా ఉంటుందని మంత్రి ఉత్తమ్ ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి వివరించారు. ఈ బియ్యాన్ని ముడి బియ్యంగా మారిస్తే నూకల శాతం ఎక్కువగా వస్తుందని, కాబట్టి వీటిని బాయిల్డ్ రైస్ రూపంలోనే కేంద్ర పూల్‌కు సరఫరా చేసేందుకు ప్రత్యేక అనుమతి ఇవ్వాలని కోరారు. భవిష్యత్తులో రాబోయే ఖరీఫ్ 2026-27 సీజన్ నుండి కేంద్రం నిర్ణయించే లక్ష్యాలు.. రాష్ట్ర ప్రభుత్వం పంపే వాస్తవ ఉత్పత్తి అంచనాలకు అనుగుణంగానే ఉండాలని సూచించారు.రైతులు పండించిన పంటకు సకాలంలో సరైన మద్దతు ధర లభించాలంటే కేంద్ర ప్రభుత్వ కొనుగోలు లక్ష్యాలు, రాష్ట్రంలోని వాస్తవ క్షేత్రస్థాయి పరిస్థితులు ఒకదానితో ఒకటి సమన్వయంతో ఉండాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అభిప్రాయపడ్డారు. జూన్ 23న న్యూఢిల్లీ వేదికగా కేంద్ర మంత్రితో జరిగిన ఈ సమావేశం ఎంతో సానుకూలంగా సాగిందని, తెలంగాణ వినతులపై కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. రైతు ప్రయోజనాల విషయంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికీ రాజీపడదని, ప్రతి గింజకూ మద్దతు ధర అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# సంశయం నుంచి నమ్మకానికి, భయం నుంచి స్వేచ్ఛకు నవ భారత్ ప్రయాణం

**పీయూష్ గోయల్**

దశాబ్దాలుగా దేశ పౌరుల పట్ల భారత నియంత్రణ వ్యవస్థ అపనమ్మకంతో ఉండేది. చిన్నపాటి, విధానపర ఉల్లంఘనలైనా లేదా అధికారంలో ఉన్న వారికి ఏ మాత్రం అనుమానం వచ్చినా వ్యక్తులను నేరస్తులుగా పరిగణించేది. ఈ పరిస్థితుల్లో మార్పు తీసుకువచ్చేలా.. సామాన్యుడి పట్ల నమ్మకం, కరుణతో వ్యవహరిస్తూ.. మోదీ ప్రభుత్వం నూతన విధానాలను రూపొందించింది.ప్రజలకు, వ్యాపారాలకు మద్దతివ్వడం, నిబంధనలను సులభతరం చేయడం, వ్యాపారాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించడం ద్వారా భారతీయ న్యాయ వ్యవస్థను మెరుగుపరిచే దిశగా ప్రధానమంత్రి మోదీ అనేక చర్యలు తీసుకున్నారు. నిబంధనల భారాన్ని తగ్గించడమైనా, డిజిటలైజేషన్ అయినా లేదా ఏకగవాక్ష విధానంలో అనుమతులను జారీ చేయడమైనా... పరిపాలనను మరింత సహేతుకంగా, సమర్థంగా తీర్చిదిద్దేలా విస్తృతమైన మార్పు చోటు చేసుకుంది.విశ్వాసం, కరుణ ఆధారంగా పరిపాలన చేయాలన్న ప్రధాని ఆలోచన... జన్ విశ్వాస్ చట్టం-2026లో కనిపిస్తుంది. 2023లో చేసిన ఇదే తరహా చట్టంలోనూ ఈ స్ఫూర్తి ప్రతిబింబిస్తుంది.పౌర హితం: పౌరులకు స్నేహపూర్వకంగా ఉండే నియంత్రణల వాతావరణాన్ని సృష్టించడానికి, నిబంధనలను పాటించేలా చేయడానికి... చిన్న చిన్న నేరాలను స్పష్టమైన సూత్రాల ఆధారంగా కొత్త చట్టం పరిష్కరిస్తుంది. అవి: శిక్షించే ముందు హెచ్చరించడం, నేరం తీవ్రతకు అనుగుణంగా జరిమానా విధింపు, వేగవంతమైన, పారదర్శకమైన పరిష్కారం, అమలు విధానం సమర్థంగా, సందర్భోచితంగా, స్పందించేదిగా ఉండేందుకు కాలానుగుణంగా సవరించుకోవడానికి వీలున్న జరిమానా విధానం.ఇది వలసవాదం కాలం నాటి పాలనా విధానాల ద్వారా 21వ శతాబ్దపు ఆకాంక్షలను నెరవేర్చలేమన్న ప్రధానమంత్రి ఆలోచనకు అనుగుణంగా నియంత్రణల్లో, నిబంధనలను పాటించడంలో, అమలు చేయడంలో వచ్చిన ప్రధాన మార్పును సూచిస్తుంది.ఈ సంస్కరణల స్థాయి అపూర్వం. 23 మంత్రిత్వ శాఖల పరిధిలోని 79 కేంద్ర చట్టాల్లో ఉన్న 784 నిబంధనలను జనవిశ్వాస్ చట్టం సవరించింది. జీవన సౌలభ్యాన్ని మెరుగుపరిచేలా 717 నిబంధనలను నేరరహితం చేసింది. మరో 67 నిబంధనలను హేతుబద్ధీకరించింది. స్వతంత్ర భారత చరిత్రలోనే పెద్ద మొత్తంలో నిబంధనలను నేరరహితం చేసిన ప్రక్రియ ఇదే.ఇది 1,000కి పైగా తప్పులను నేరరహితం చేస్తుంది. కాలం చెల్లిన, అనవసరమైన నిబంధనలను తొలగిస్తుంది. వలసవాద కాలం నాటి పాత నేర చట్టాలను తొలగిస్తుంది. మధ్యవర్తిత్వాన్ని, క్రిమినల్ కోర్టుల వెలుపల అప్పీలు వ్యవస్థలను మెరుగుపరుస్తుంది.స్వాగతించదగిన మార్పులు: గతంలో ఎవరైనా రాత్రి సమయంలో ఓ ఇంట్లో, భవనంలో లేదా వాహనంలో కనిపిస్తే... దానికి ''సంతృప్తికరమైన వివరణ'' ఇవ్వని పక్షంలో... వారికి మూడు నెలల జైలు శిక్ష విధించేందుకు అవకాశం ఉండేది. ఇది సాధారణ ప్రయాణాన్ని సైతం తీవ్రమైన నేరంగా పరిగణించే వలసవాద, అపనమ్మకంతో కూడిన విధానాన్ని ప్రతిబింబిస్తుంది. తాజా సంస్కరణ.. ఈ నేర నిబంధనను రద్దు చేసి, ఆధునిక విధానాలకు అనుగుణంగా చట్టాన్ని మారుస్తుంది.పాత విధానం ప్రకారం ఒక వ్యక్తి డ్రైవింగ్ లైసెన్సు గడువు ముగిసిన మరుసటి రోజు రోడ్డుపై వాహనం నడిపితే డ్రైవర్ క్రిమినల్ కేసులను ఎదుర్కోవాల్సి వచ్చేది. కొత్త చట్టంలో లైసెన్సు పునరుద్ధరణకు 30 రోజుల అదనపు గడువు లభిస్తుంది.ఓ చిన్నస్థాయి తయారీదారు అప్రెంటిస్ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ వివరాలను ఇవ్వలేదని అనుకుందాం. గతంలో అయితే.. దీనిని నేరపూరిత అతిక్రమణగా పరిగణించేవారు. కానీ ఇప్పుడు, పదే పదే నిబంధనలను ఉల్లంఘించినప్పుడు మాత్రమే కఠిన చర్యలు తీసుకుంటారు.అదే విధంగా, మైనింగ్ సంస్థ పత్రాల్లో విధానపరమైన లోపం ఉంటే అది జైలు శిక్షకు దారి తీసేది. ఇప్పుడు, అలాంటి కేసుల్లో సివిల్ జరిమానాలను విధిస్తున్నారు. అక్రమ మైనింగ్, మోసం, ఉద్దేశపూర్వకంగా హాని తలపెట్టడం, ప్రజాప్రయోజనాలకు భంగం కలిగించినప్పుడు మాత్రమే నేరంగా పరిగణిస్తారు. కాగితపు పనిలో లోపాలను కాదు.అందరికీ లబ్ధి చేకూర్చిన పుష్కర కాల పాలన: దేశ ప్రజల జీవితాలను సులభతరం చేయాలన్న ప్రధాని మోదీ ఆలోచనలకు జన విశ్వాస్ చట్టం ప్రతీకగా నిలుస్తుంది. గతంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా, 12 ఏళ్లుగా దేశ ప్రధానిగా సేవలు అందిస్తున్న మోదీ చేపట్టిన కార్యక్రమాల్లో ఇది ముఖ్యమైనది.2023లో మొదటి జన విశ్వాస్ చట్టం ద్వారా 42 చట్టాల్లోని 183 నిబంధనలను భారత్ నేరరహితం చేసింది. దీని ఆధారంగా జనవిశ్వాస్-2026 రూపుదిద్దుకుంది. ఈ చర్య... చట్టాల అమలును బలహీనం చేయకుండానే... నేరరహితం చేయడం ద్వారా పాలనను మెరుగుపరచవచ్చని తెలియజేసింది. 2026లో ఈ చట్టం పరిధి నాలుగు రెట్లు విస్తరించింది. దీని ద్వారా సంస్కరణ ఒక్కసారి మాత్రమే చేపట్టే కార్యక్రమం కాదనీ, అది నిరంతరం కొనసాగే ప్రక్రియ అని స్పష్టమవుతోంది.బృహత్తర లక్ష్యం: భారతీయుల జీవితాలను మెరుగుపరచాలన్న పీఎం మోదీ విస్తృత లక్ష్యంలో ఈ కొత్త చట్టం ఓ భాగం. ఈ లక్ష్యంలో భాగంగా ప్రతి పౌరునికీ ఆహారం, దుస్తులు, ఇల్లు అందించేందుకు కృషి చేశారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు నేరుగా అందే ఏర్పాటు చేశారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు.. సంక్షేమం కోసం ఖర్చు చేస్తున్న దానిలో 15 శాతం మాత్రమే పేదలకు చేరుతుందని అప్పటి కాంగ్రెస్ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ చెప్పిన దానికి ఇది భిన్నంగా ఉంది.తక్కువ ప్రభావం ఉన్న నేర నిబంధనల స్థానంలో పరిపాలనాపరమైన, ద్రవ్యపరమైన విధానాలు తీసుకు రావడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఇది సాధారణ పౌరులతో పాటు చిన్న వ్యాపారాలకు కూడా సహాయకారిగా ఉంటుంది. సాధారణ సాంకేతిక అతిక్రమణలపై కాకుండా తీవ్రమైన ఉల్లంఘనలపై దృష్టి సారించేలా ఎన్ఫోర్స్‌మెంట్ సంస్థలకు ఇది వీలు కల్పిస్తుంది. న్యాయపరమైన జోక్యం అవసరమైన కేసులను పరిష్కరించడంపై కోర్టులు దృష్టి సారిస్తాయి.

ఆర్థిక వ్యవస్థ-పెట్టుబడులు: పరిపాలన పరిధిని మించి ఈ ప్రయోజనాలు విస్తరించాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పోటీతత్వం పెరుగుతున్న నేపథ్యంలో... నియంత్రణల విశ్వసనీయత ప్రధానమైన అంశం. సాంకేతిక లోపాలకు కూడా క్రిమినల్ విచారణ ఎదుర్కోవాల్సి వస్తుందనే ఆందోళనలు అనేక సంవత్సరాలుగా... పెట్టుబడులకు అడ్డంకిగా ఉన్నాయి. 2014-2025 మధ్య కాలంలో భారతదేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) 143 శాతం పెరిగాయి. ఈ వృద్ధి ధోరణి కొనసాగుతోంది. ఎఫ్‌డీఐల్లో కనిపిస్తున్న ఈ వృద్ధిలో నియంత్రణ సంస్కరణలు ముఖ్యమైన భూమిక పోషిస్తున్నాయి. పెట్టుబడులకు, సంస్థలకు ఊహించదగిన, విశ్వసనీయమైన గమ్యస్థానంగా భారత్‌ను మార్చడం ద్వారా ఈ వేగాన్ని మరింత బలోపేతం చేసేలా జన విశ్వాస్-2026ను రూపొందించారు.న్యాయ వ్యవస్థకు సైతం ఈ సంస్కరణలు ఉపశమనాన్ని అందించాయి. జిల్లా, సబార్డినేట్ న్యాయస్థానాల్లో ఉన్న 4.9 కోట్ల కేసులతో సహా దేశవ్యాప్తంగా పెండింగులో ఉన్న కేసుల సంఖ్య సుమారు 5.5 కోట్లకు పైమాటే. వీటిలో చాలా వరకు కేసులు చిన్నపాటి నియంత్రణలకు సంబంధించినవే కావడంతో వాటిని నేరరహితం చేశారు. ఇలాంటి కేసులను పరిపాలనా తీర్పు పరిధిలోకి తీసుకురావడం వ్యాపారపరమైన సంస్కరణ మాత్రమే కాదు. ఇది న్యాయ సంస్కరణ. దీనివల్ల న్యాయస్థానాలకు పరిమితంగా అందుబాటులో ఉన్న సమయాన్ని, వనరులను తీవ్రమైన వివాదాలు, న్యాయపరమైన ప్రశ్నలపై కేంద్రీకరించడానికి వీలవుతుంది.తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కఠినంగా ఉండాల్సిన చోట చట్టం కఠినంగానే ఉంటుంది. మారింది విధానం మాత్రమే. సంశయం నుంచి నమ్మకానికి, అభియోగం నుంచి దిద్దుబాటుకు, భయం నుంచి స్వేచ్ఛకు పరిపాలన మారింది.



(రచయిత కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి)

# శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా ఘన నివాళులు

- **ఉప్పర్‌పల్లి బీజేపీ కార్యాలయంలో నివాళులర్పించిన పార్టీ నాయకులు**
- **బొక్క బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం**

**ఉప్పర్‌పల్లి వెలుతురు జూన్ 23:**

జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా ఉప్పర్‌పల్లి బీజేపీ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ నాయకుడు బొక్క బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ సమైక్యత, జాతీయత, ప్రజాసేవ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ త్యాగం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. "ఒక దేశంలో రెండు విధానాలు, రెండు జెండాలు, రెండు రాజ్యాంగాలు ఉండవు" అనే శ్యామ ప్రసాద్ ముఖర్జీ సంకల్పం దేశ సమైక్యతకు ప్రతీకగా నిలిచిందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సులేగా విట్టల్, గోనె మోహన్‌రెడ్డి, గోనె శ్రీకాంత్‌రెడ్డి, నర్సింగ్‌రావు, ఉపిలితి పవన్, సులేగా విజయ్, పలుగుచెరువు నరేందర్, భూపాల్ ముదిరాజ్, లింగాల రాకేష్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొని శ్యామ ప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పించారు.



# ఒలింపిక్ స్ఫూర్తిని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి: మంత్రి వాకిటి శ్రీహరి పిలుపు

- **ఎల్‌బీ స్టేడియంలో వైభవంగా ఒలింపిక్ డే రన్-2026 ప్రారంభం**

**హైదరాబాద్, వెలుతురు జూన్ 23:**

ప్రతి ఒక్కరిలో క్రీడా చైతన్యాన్ని, ఒలింపిక్ స్ఫూర్తిని నింపడమే లక్ష్యంగా ఒలింపిక్ డే రన్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర క్రీడా, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన ఒలింపిక్ డే రన్-2026 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, సాట్స్ చైర్మన్ శివసేన రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలచారిలతో కలిసి మంత్రి ఈ పరుగును ప్రారంభించారు. నగరం నలుమూలల నుండి ఒలింపిక్ జ్యోతిని తీసుకువచ్చిన ప్రతి క్రీడాకారుడిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. ఒలింపిక్ డే రన్ కేవలం క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడమే కాకుండా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. క్రమశిక్షణతో కూడిన క్రీడాకారులే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని, దేశ సరిహద్దుల్లో పనిచేసే మిలిటరీ సైనికులకు ఉన్నంత క్రమశిక్షణ మైదానంలో క్రీడాకారులకు కూడా ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండున్నర సంవత్సరాలలో క్రీడలకు అపూర్వ ప్రాధాన్యతనిస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసిందని గుర్తుచేశారు.రాబోయే 2036 ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు దేశానికి పతకాలు సాధించి పెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందని మంత్రి వెల్లడించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు సీఎం కప్ రెండు ఎడిషన్లను రాష్ట్రవ్యాప్తంగా అత్యంత విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. క్రీడల అభివృద్ధికి అవసరమైన అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనతో పాటు యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఒలింపిక్ డే అందించే ఈ క్రీడా సందేశాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అంతర్జాతీయ, జాతీయ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ అమలుపై ప్రత్యేక...

గ్రామపంచాయతీల పనితీరు, గ్రామ కార్యదర్శుల హాజరు, పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్ల పురోగతిపై ఆరా తీశారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్వచ్ఛభారత్ మిషన్ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని అధికారులకు సూచించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండకూడదని మిషన్ భగీరథ అధికారులను మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నిరంతరాయంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గ్రామీణ రహదారుల నిర్మాణం, మరమ్మతు పనులను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాల బలోపేతం, బ్యాంకు లింకేజీల పెంపు, మహిళలకు ఉపాధి అవకాశాల విస్తరణకు కార్యాచరణ రూపొందించాలని సెర్ప్ అధికారులకు సూచించారు.

ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా ప్రతి సంక్షేమ, అభివృద్ధి పథకాన్ని సమర్థంగా అమలు చేయాలని సీతక్క అధికారులను ఆదేశించారు. గ్రామీణ తెలంగాణ అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సమావేశం అనంతరం గ్రామస్థాయిలో భూగర్భ జలాల పెంపునకు అవగాహన కల్పించే 'జలసిరి' పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు.

# డబుల్ బెడ్ రూం ఇండ్ల పనులను వేగవంతం చేయాలి: కలెక్టర్

**హైదరాబాద్, వెలుతురు జూన్ 23:**

భోజగుట్టలో శరవేగంగా జరుగుతున్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా పరిశీలించారు. ఆసిఫ్ నగర్ పరిధిలోని భోజగుట్ట క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా అధికారులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్.. పనుల్లో వేగం పెంచి నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. 13 ఎకరాల విస్తీర్ణంలో 73 బ్లాకుల్లో నిర్మిస్తున్న 1,824 గృహాల ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిరుపేద కుటుంబాలకు గౌరవప్రదమైన గృహ వసతి కల్పించాలనే ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని, నిర్మాణంలో ఎదురవుతున్న అడ్డంకులను అప్పటికప్పుడు పరిష్కరిస్తూ సమన్వయంతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు.ప్రస్తుతం మంజూరైన ఇండ్లలో 192 యూనిట్ల నిర్మాణం దాదాపు పూర్తికావచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు. మిగిలిన ఇండ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని, నాణ్యతా ప్రమాణాలలో ఎలాంటి రాజీ పడకుండా పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



# డాక్టర్ ప్రేమ్‌రాజ్ యాదవ్‌ను పరామర్శించిన గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి





- **శంషాబాద్ సమీపంలోని కన్నా ఆశ్రమంలో చికిత్స పొందుతున్న బీజేపీ సీనియర్ నేత**
- **త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన గవర్నర్..**
- **వైద్యులతో మాట్లాడి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచన**

**శంషాబాద్, వెలుతురు జూన్ 23:**

అనారోగ్యంతో శంషాబాద్ సమీపంలోని కన్నా ఆశ్రమంలో చికిత్స పొందుతున్న భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ ప్రేమ్‌రాజ్ యాదవ్‌ను త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆశ్రమానికి చేరుకున్న గవర్నర్ ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా వైద్యులతో ప్రత్యేకంగా మాట్లాడిన గవర్నర్, డాక్టర్ ప్రేమ్‌రాజ్ యాదవ్‌కు అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తూ, ఆయన త్వరగా కోలుకునేలా అన్ని విధాలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎన్నో దశాబ్దాలుగా పార్టీ సిద్ధాంతాల కోసం సేవలందించిన ప్రేమ్‌రాజ్ యాదవ్ త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలో తిరిగి చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు బొక్క బాల్‌రెడ్డి, పార్టీ నాయకులు బాబూరావు, వెంకటేష్ తదితరులు పాల్గొని డాక్టర్ ప్రేమ్‌రాజ్ యాదవ్ యోగక్షేమాలను అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# గ్రామ పంచాయతీ ఆమోదించిన రోడ్డుపై కబ్జా ఆరోపణలు

**శంకర్పల్లి, వెలుతురు జూన్ 23 :**



గ్రామ పంచాయతీ అనుమతితో ఏర్పాటు చేసిన లేఅవుట్కు చెందిన 30 అడుగుల రహదారిని కొంత మంది వ్యక్తులు కబ్జా చేయడంతో తమ వెంచర్కు వెళ్లే మార్గం లేకుండా పోయిందని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు తమకు దారి చూపడంలో విఫలమవుతున్నారని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ 1990లో సింగాపురం గ్రామంలోని సర్వే నెంబర్ 51లో 3 ఎకరాల 8 గుంటల భూమిని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులం కొనుగోలు చేశామన్నారు. అనంతరం 1992లో గ్రామ పంచాయతీ అనుమతితో వెంచర్ను అభివృద్ధి చేసి, లేఅవుట్ ప్రకారం శంకర్పల్లి సంగారెడ్డి ప్రధాన రహదారి నుంచి సర్వే నెంబర్ 52 మీదుగా 30 అడుగుల వెడల్పుతో రహదారి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే కాలక్రమేణా ఆ రహదారిని కొంతమంది ఆక్రమించుకోవడంతో వెంచర్లోని ప్లాట్లకు రాకపోకలు నిలిచిపోయాయని వాపోయారు. ఈ సమస్యపై 2020 నుంచి జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసిల్దార్, మున్సిపల్ కమీషనర్ తదితర అధికారులకు పలు మార్లు ఫిర్యాదులు చేశామని తెలిపారు. మా ఫిర్యాదులపై స్పందించిన హెచ్ఎండీఏ అధికారులు అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ స్వరూప మంగళవారం సర్వే నెంబర్ 51ను పరిశీలించారు. విచారణ నిర్వహించి సమస్యకు పరిష్కారం చూపడంతో పాటు బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

# శంకర్ పల్లి మండల ఉప సర్పంచుల ఫోరం ఎన్నిక

- అధ్యక్షుడిగా ధరణి రమేష్ ఏకగ్రీవం

**శంకర్ పల్లి, వెలుతురు జూన్ 23 :**



శంకర్ పల్లి మండల ఉప సర్పంచుల ఫోరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు అవిశిపేట ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని ఉప సర్పంచులందరూ ఏకతాటిపైకి వచ్చి నూతన కార్యవర్గాన్ని ఒకే అభిప్రాయంతో ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉప సర్పంచులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ నిరంతరం కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.

# బండాలేముర్ గ్రామంలో అడవి పశువులు నివసించే ప్రాంతాన్ని పరిశీలించిన పశుశాఖ జిల్లా అధికారులు

- కందకాలు కంచెలు వేసి పట్టుకొని పశువులను తరలిస్తాము
- పశుసంవర్ధక శాఖ జిల్లాఅధికారి శ్రీనివాస్ రావు

**మంచాల వెలుతురు జూన్ 23:**



మంచాల మండలం బండ లేమూర్ గ్రామంలో అడవి పశువులు నివసించే ప్రాంతంలో పర్యటించి పరిశీలించిన జిల్లా పశుశాఖ అధికారి శ్రీని వాసరావు ఫారెస్ట్ అధికారులుఈ సందర్భంగా మాట్లాడుతూ కందకాలు కంచెలు వేసి వెంటనే అడవి పశువులను తరలించి రైతుల పంట లకు నష్టం జరగకుండా చూస్తాం అని అన్నారు అడవి పశువులను తరలించి రైతుల పంట పొలాలను కాపాడాలని బండ లేమూర్ గ్రామ రైతులు జిల్లా కలెక్టర్ కు విన్నవిం చిన సంగతి తెలిసినదే జిల్లా కలెక్ట ర్ ఆదేశాల మేరకు పశుసంవర్ధక శాఖ,అటవీ శాఖపంచాయతీ రాజ్ శాఖ అధికారులు బం డ లేమూర్ ప్రజాప్రతి నిధులు కలిసి పశువులు నివసించే ప్రదేశాలను పరిశీలించారు.పశువులు మూడు గుంపులుగా ఉంటూ మూడు ప్రదేశాల్లో రాత్రిపూట ఉంటున్నాయని గుర్తించారు వాటిని పట్టుకోవాలంటే మూడు చోట్ల కందకాలు లేదా ఇనుప కంచెలు వేసి అందులోకి పోయినతర్వాత మత్తు సూదులు ఇచ్చి పట్టుకోవాల్సి ఉంటుందన్నారు అక్కడి నుండి పశువులను గోశాలకు తర లించాలని తెలిపారు ఇందుకు పశువుల వలన నష్టపోతున్న రైతులు సహకారం అందించాలని కోరారు ఈవిషయం జిల్లా కలెక్టర్ కు నివేదిస్తామని చెప్పారుకలెక్టర్ ఆదేశాలమేరకు కందకాలు తీయాల లేదా ఇనుప కంచె లు వేయాలా అనేది చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ స ర్పంచ్ పి శ్రీనివాస్ నాయక్ మాజీ సర్పంచ్ పోచమోని కృష్ణ పంచాయతీ కార్యదర్శి పాండు రంగా రెడ్డి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గంగారాం వార్డు సభ్యులు జర్పుల కిషన్ జక్కలి సాలయ్య ఆరుట్ల పశు వైద్యులు చంద్రావతి రైతులుసత్యం మల్లేష్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

# వేతనాలు చెల్లించాలి, ఏజెన్సీలను రద్దు చేయాలి

- కోఠిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల భారీ నిరసన

**హైదరాబాద్, వెలుతురు జూన్ 23:**

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కోఠిలోని వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ కార్యాలయం వద్ద ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆందోళనలో వందలాది మంది సిబ్బంది పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శానిటేషన్ సిబ్బంది, 104 వాహనాల సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లతో పాటు కొందరు డాక్టర్లకు కూడా నెలల తరబడి వేతనాలు చెల్లించడం లేదని, కాంట్రాక్ట్ ఏజెన్సీల నిర్లక్ష్యం వల్లే ఈ జాప్యం జరుగుతోందని ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్ మాట్లాడుతూ.. జీతాల చెల్లింపులో తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న కాంట్రాక్ట్ ఏజెన్సీల విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. థర్డ్ పార్టీ వ్యవస్థను తొలగించి, ప్రభుత్వం నేరుగా ట్రెజరీ ద్వారానే ఉద్యోగులందరికీ వేతనాలు చెల్లించాలని కోరారు. గత 20 ఏళ్లుగా వైద్య ఆరోగ్య శాఖలో నమ్ముకుని పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, అలాగే మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవుల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

వైద్య రంగంలో రాత్రింబగళ్లు సేవలందిస్తున్న సిబ్బంది పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలని శ్రీనివాస్ హితవు పలికారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించకపోతే, రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు లక్ష మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో హైదరాబాద్ నగరాన్ని దిగ్బంధం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ ముఖ్య నాయకులు, జిల్లాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ఆరోగ్య శాఖ ఔట్‌సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి: కేటీఆర్ పిలుపు

- ఘనంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం...
- దొంగ ఓట్ల తొలగింపుపై దృష్టి పెట్టాలి
- కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం
- భారీగా తరలివెళ్లిన వివేకానంద నగర్ డివిజన్ నాయకులు, కార్యకర్తలు..

**కూకట్ పల్లి జూన్ 23 వెలుతురు:**



శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని మియాపూర్ నరేన్ గార్డెన్‌లో బిఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ముఖ్యఅతిథిగా హాజరై, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ ప్రాముఖ్యత కలిగిన సమావేశానికి వివేకానంద నగర్ డివిజన్ నుండి మాజీ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

**ఓటరు సర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టాలి:**

సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. నేటి నుండి ప్రారంభం కానున్న ఓటరు సమగ్ర సవరణ ప్రక్రియపై పార్టీ శ్రేణులు ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ప్రతి బూత్ పరిధిలోని కార్యకర్తలు అప్రమత్తంగా ఉంటూ, ప్రతి ఇంటిని సందర్శించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చూడాలని, అదే సమయంలో జాబితాలో ఉన్న దొంగ ఓట్లను గుర్తించి వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. త్వరలోనే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం కానుందని, వీలైనంత ఎక్కువ మందిని బిఆర్ఎస్‌లో భాగస్వామ్యం చేయాలని కోరారు.

**కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టండి:**

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను, వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా మద్దతుతో మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని స్థాపించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో కష్టపడాలని పిలుపునిచ్చారు.

**విజయవంతం చేసిన శ్రేణులు:**

ఈ విస్తృత స్థాయి సమావేశంలో సీనియర్ నాయకులు గొట్టుముక్కల పెద్ద భాస్కరరావు, మాచర్ల భద్రయ్య, వేముల ఆంజనేయులతో పాటు నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బాగ్ అమీర్ పాఠశాలలో నీటి సమస్యకు తక్షణ పరిష్కారం

- త్వరితగతిన స్పందించిన కాంగ్రెస్ నాయకురాలు విద్యాకల్పన ఏకాంత్ గౌడ్..
- విద్యార్థులకు తాత్కాలికంగా నీటి సరఫరా ఏర్పాటు

**కూకట్ పల్లి, జూన్ 23 వెలుతురు:**

వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని బాగ్ అమీర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న నీటి సమస్యపై రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు విద్యాకల్పన ఏకాంత్ గౌడ్ తక్షణమే స్పందించారు. ఇటీవల పాఠశాల సమీపంలో ఇంకుడు గుంత తవ్వుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే నీటి కనెక్షన్ పైప్‌లైన్ కట్ అయింది. దీనివల్ల గత కొన్ని రోజులుగా పాఠశాలలో విద్యార్థులకు తాగునీరు, ఇతర అవసరాలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ఈ విషయాన్ని స్థానికులు, పాఠశాల సిబ్బంది మంగళవారం విద్యాకల్పన ఏకాంత్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న విద్యాకల్పన ఏకాంత్ గౌడ్ వెంటనే బాగ్ అమీర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థుల ఇబ్బందులను గమనించి, తక్షణ ఉపశమనంగా పాఠశాలకు తాత్కాలికంగా నీటిని తెప్పించి సరఫరా చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పైప్‌లైన్ డ్యామేజ్ కావడం వల్లే ఈ సమస్య తలెత్తిందని, దీనిపై స్థానిక శాసనసభ్యులు ఆరికేపూడి గాంధీ సహకారంతో జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా వీలైనంత త్వరగా పైప్‌లైన్ మరమ్మతులు పూర్తి చేసి, శాశ్వతంగా నీటి సరఫరాను పునరుద్ధరించాలని అధికారులను కోరినట్లు ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తామని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



# డా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ గారికి ఘనమైన నివాళి

**ఎల్‌బి నగర్ వెలుతురు జూన్ 23:**





డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి (బలిదాన్ దివస్) సందర్భంగా ఎల్‌బి నగర్ బీజేపీ పార్టీ ఘన నివాళులు డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి (బలిదాన్ దివస్) సందర్భంగా ఎల్‌బి నగర్ జిల్లా కార్యాలయం మరియు రింగ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు బోల్గాం యాస్పాల్ గౌడ్, బండారి భాస్కర్, బీజేపీ నాయకులు బొంగు రఘు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, మహిళా నాయకులు మరియు పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొని శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశ సమైక్యత మరియు జాతీయ ఏకత్వం కోసం డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

ఆయన ఆశయాలను నెరవేర్చే దిశగా కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని, అందులో భాగంగానే జమ్మూ–కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370 రద్దు ఒక కీలక ఘట్టమని అన్నారు. డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ కలలుగన్న సమైక్య భారత నిర్మాణానికి బీజేపీ కట్టుబడి ఉందని తెలిపారు."ఒకే దేశం – ఒకే రాజ్యాంగం – ఒకే జెండా" అనే డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు మా ఘన నివాళులు.

# కుషాయిగూడ పోలీసుల భారీ సక్సెస్.. 14 చోరీ వాహనాల రికవరీ



- సీరియల్ బైక్ దొంగ అరెస్ట్
- రూ.7 లక్షల ఆస్తి స్వాధీనం

**కాప్రా, జూన్ 23 (వెలుతురు):**

కుషాయిగూడ పోలీసులు ద్విచక్ర వాహనాల చోరీ కేసులను ఛేదించి మరోసారి తమ సమర్థతను నిరూపించారు. వరుసగా చోటుచేసుకుంటున్న బైక్ చోరీలపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు ఒక సీరియల్ నిందితుడిని అరెస్టు చేసి, వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీకి గురైన 14 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రికవరీ చేసిన వాహనాల విలువ సుమారు రూ.7 లక్షలు ఉంటుందని అధికారులు వెల్లడించారు.జూన్ 13న చక్రిపురంలోని ఎంఆర్ఆర్ కాలనీలో నివాసముంటున్న సింగిరికొండ గురునాథం తన హోండా యాక్టివాను కుషాయిగూడ మార్కెట్ వద్ద పార్క్ చేయగా గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ నెల 23న చక్రిపురం ఎక్స్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతను ప్రయాణిస్తున్న వాహనం చోరీకి గురైనదిగా తేలడంతో లోతుగా విచారించారు. విచారణలో నిందితుడు పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు అంగీకరించడంతో మొత్తం 14 వాహనాలను పోలీసులు రికవరీ చేశారు.బహిరంగ ప్రదేశాల్లో నిర్లక్ష్యంగా పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను డూప్లికేట్ తాళాల సహాయంతో అపహరించి, వాటిని తక్కువ ధరలకు విక్రయించేవాడని పోలీసులు తెలిపారు. వచ్చిన డబ్బును వ్యక్తిగత ఖర్చులు, మద్యం సేవనం, విలాసవంతమైన జీవనశైలికి వినియోగించేవాడని వెల్లడించారు.నిందితుడిపై గతంలో ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా వాహన చోరీ కేసు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు.వాహన యజమానులు అదనపు లాకింగ్ వ్యవస్థలు, యాంటీ థెఫ్ట్ పరికరాలు వినియోగించాలని, భద్రత కలిగిన ప్రదేశాల్లోనే వాహనాలు పార్క్ చేయాలని పోలీసులు సూచించారు. అలాగే వాహన పత్రాలు, స్పేర్ తాళాలను సురక్షితంగా భద్రపరచాలని కోరారు.మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో చేపట్టిన ఈ ఆపరేషన్‌ను పోలీస్ కమిషనర్ బి. సుమతి ఐపీఎస్, డీసీపీ కె. సురేష్ కుమార్ ఐపీఎస్, అదనపు డీసీపీ ఎన్. వెంకట రమణ, ఏసీపీ వై. వెంకట్ రెడ్డి పర్యవేక్షించారు. కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి. వెంకటేశ్వర్లు మరియు వారి సిబ్బంది కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించారు. కేసును త్వరితగతిన ఛేదించి వాహనాలను రికవరీ చేసిన పోలీసు బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

# సబండ వర్గాల పోరాటంతోనే అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని రద్దు చేసుకున్నారు

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 23:**

మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రామన్నపేట ప్రాంతంలో ఆదాని గ్రూప్ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని నెల కొల్పడాన్ని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తీవ్రంగా వ్యతిరే కించడం జరిగింది. కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించి అధికారులకు కంపెనీని నెలకొల్పోవద్దని అన్ని ప్రభుత్వ ఆఫీసుల్లో మెమోరండం ఇవ్వడం జరిగింది. పబ్లిక్ ఇయర్ రింగ్ రోజు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అయినా తనను కూడా చాలా ఇబ్బందులకు గురిచేసి అరెస్టు చేయడం జరిగింది. అయినా మా పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని వివిధ రూపాలలో నిరసన కార్యక్రమాలు నిర్వహించి వ్యతిరేకించడం జరిగింది. ఈ ప్రాంతంలోని అన్ని రాజకీయ పార్టీలు వారు అన్ని కుల సంఘాలు యువజన సంఘాలు మేధావులు వివిధ వర్గాల వారు పట్టణ ప్రజలు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం తీసుకొచ్చి ఈ ప్రాంతంలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల ఈ ప్రాంతం



పూర్తిగా కాలుష్య మహమ్మారితో నిండిపోతుందని గాలి నీరు కలుషితమై ప్రజల జీవన ప్రమాణాలకు ప్రమాదము అయ్యే అవకాశం ఉందని పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించి ఈ కంపెనీని ఇక్కడ ఏర్పాటు చేయకుండా అడ్డుకోవడం జరిగింది. సంవత్సరం క్రితమే ఆదాని కంపెనీ వారు ఇక్కడ సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తలేమని తెలపడం జరిగింది. కానీ అధికార పార్టీ వారు కలెక్టర్ ఆఫీస్ లో సమావేశం నిర్వహించి ఈ కంపెనీని మేమే అడ్డుకున్నామని గొప్పలు చెప్పుకుంటూ పాలాభిషేకాలు స్వీట్ల పంపిణీ చేసుకోవడం విడ్డూరంగా ఉందని తెలియజేయడం జరిగింది. ప్రజా సమస్యలు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఇంకా ధాన్యం రాశులు కొన్ని గ్రామాలలో కుప్పలు కుప్పలుగా ఉండడం జరిగింది రైతులను నానారకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రైతుబంధు ఇవ్వరు రైతు బీమా లేదు, యూరియా దొరకట్లేదు నకిలీ విత్తనాలు అన్ని రకాలుగా రైతులను ఇబ్బందులకు గురి చేయడం జరుగు తుందని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం పల్లివాడ సర్పంచ్ కంభంపాటి శ్రీనివాస్ మాజీ ఎంపీటీసీలు వేమవరం సుధీర్ బాబు, పున్న వెంకటేశం, ఎండి ఆమీర్. జిల్లా నాయకులు బద్దుల రమేష్, ఎస్.కె చాంద్, పట్టణ కార్యదర్శి జాడ సంతోష్ నాయకులు బొడ్డు అలయ్య, ఎండి అజాజ్ ఖాన్, జాల అమరేందర్ రెడ్డి, చిన్నపాక రమేష్, చెరుకు ఉపేందర్, ఎండి మోసబ్, బాసాని రాజు, ఎండి ఆరిఫ్, అంతటి మల్లేశం తదితరులు పాల్గొనడం జరిగింది.

# రోడ్డు మలుపులు మరణానికి ముప్పు

- **ప్రాణాలు బలిగొంటున్న రహదారులు**

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 23:**



రామన్నపేట నుండి నిర్ణంలో లక్ష్మాపురం శోభనా ద్రిపురం వేములకొండ శ్రీ మచ్చగిరి లక్ష్మీనరసింహస్వామి గుట్టకి నిత్యం వందలాది వాహనాలు ద్విచక్ర వాహనాలు కార్లు లారీలు ప్రభుత్వ బస్సు తదితర వాహనాలు నిత్యం నడుస్తూ ఉంటాయి ఇక్కడ రామన్నపేటకు అత్యంత సమీపంగా ఉన్న గ్రామం నీర్నేముల రామన్నపేట నుండి నీర్నేముల వరకు ప్రమాదాలు నిత్యం జరుగుతున్నాయి అయితే నిన్న జరిగిన రోడ్డు ప్రమాదంలో నిర్ణయంలో గ్రామ వాస్తవ్యులు కన్నబోయిన కృష్ణ లారీ ప్రమాదంలో మృతి చెందాడు ఆ మూలమలుపు వద్ద రోడ్డు ఆక్రమణకు గురైంది అక్కడ ఎలాంటి ప్రమాద హెచ్చరికలు లేకుండా ఉన్నది గతంలో అదే స్థానం వద్ద శానకొండ యాదగిరి ఆటో ఢీకొని మృత్యువాత పడ్డాడు ఇక్కడ నిత్యం రైతు కూలీలు వ్యవసాయదారులు ఉద్యోగస్తులు వ్యాపారవేత్తలు తిరుగుతున్నటువంటి రహదారి ఈ రహదారిలో రోడ్డు ఆక్రమణకు గురైంది రోడ్డు నానుకొని ఒక ఫీట్ దూరంలో వ్యవసాయాలు సాగు చేస్తున్నారు దీనిపై అధికారులు స్పందించాలి రోడ్డు ఆక్రమణకు గురైనప్పుడు నిమ్మకు నిలెత్తినట్టుగా అధికారులు ఉండడం సూచనియం ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే ఇవి గుర్తుకొస్తున్నాయి తర్వాత యధావిధిగా ఎవరి పనులు వారు చేసుకుంటున్నారు కానీ ఈ ప్రమాదాలకు అమాయక ప్రజలు బలవుతున్నారు ఆ కుటుంబానికి పెద్దదిక్కుని కోల్పోతున్నారు ఇలాంటి ప్రమాదాలను నివారించి ప్రజలకు రక్షణ కల్పించే విధంగా ప్రమాద హెచ్చరిక బోర్డులను సూచికలను ఏర్పాటు చేసి ఆక్రమణకు గురైనటువంటి రోడ్డు ఏదైతే ఉందో దానిని తిరిగి రోడ్డు వెడల్పు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

- **వ్యవసాయ అధికారులకు వినతి పత్రం అందించిన బీఆర్ఎస్ యువజన నాయకులు**

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 23:**

వానాకాలం సీజన్‌లో రైతులకు సరిపడా యూరియా, ఇతర ఎరువులు మరియు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని బీఆర్ఎస్ మండల యువజన నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో నార్కెట్‌పల్లి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి (AEO) విష్ణువర్ధన్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. యాప్ ద్వారా యూరియా బుకింగ్ విధానం అమలు చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానం లేని రైతులు బుకింగ్ చేసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.అందువల్ల వెంటనే యాప్ విధానాన్ని రద్దు చేసి,




రైతులకు నేరుగా సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. అలాగే నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టి, ఈ సీజన్‌కు అవసరమైన నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతులతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల యువజన అధ్యక్షుడు పుల్లెంల వెంకట్, యువజన పట్టణ అధ్యక్షుడు నడింపల్లి మహేష్, మాజీ మండల కో-ఆప్షన్ సభ్యుడు వాజిత్ ఆసిఫ్, తొగరవెల్లి నాగరాజు, దుబ్బాక అరుణ్, బాసిత్, రాచకొండ సాయి, అక్కెనపల్లి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.ఈ కాపీని నేరుగా పత్రికా ప్రకటన లేదా సోషల్ మీడియా పోస్టు కోసం ఉపయోగించవచ్చు.

# భారత ప్రధాని నరేంద్ర మోడీ 12 ఏళ్ల పాలన అద్భుతం

**రామన్నపేట వెలుతురు జూన్ 23:**



రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలో గౌరవ భారత ప్రధాని నరేంద్ర మోడీ 12 ఏళ్ల సుపరిపాలన అనంతరం పురస్కరించుకొని మొక్కలు నాటడం జరిగింది. అలాగే శ్యాం ప్రకాష్ ముఖర్జీ బలిదాన్ దివాస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఓ బి సి మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కల రాజు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు పిట్టల శ్రీనివాస్. వీరు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ఈ దేశ ప్రధాని అయిన తర్వాతే అంత్యోదయ సిద్ధాంతం తో సబ్కా సాత్ సబ్కా విశ్వాస్ సబ్కా వికాస్ అనే విధానంతో ప్రతి చిట్టచివరి వ్యక్తికి ఆర్థిక అభివృద్ధి ఫలాలు అందాలనే లక్ష్యం తోటి పనిచేస్తున్న వ్యక్తి నరేంద్ర మోడీ అని మాట్లాడారు అనంతరం శ్యాంప్రకాష్ ముఖర్జీ బలిదాన్ దివస్ దినోత్సవం సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ. స్టేట్ కౌన్సిల్ నెంబర్ వనం అంజయ్య. మండల ఇంచార్జ్ కొరివి శంకర్. బిజెపి సీనియర్ నాయకులు ఏళ్ల సంజీవరెడ్డి, రాపోలు స్వామి, సిరిపురం ఉపసర్పంచ్ మూడుదుడ్ల అనూష, రమేష్ మండల ప్రధాన కార్యదర్శులు జంగిలి సత్యనారాయణ, బెజ్జంకి శివకుమార్. మండల ఉపాధ్యక్షుడు బట్టే రమేష్, అక్కెనపల్లి సైదులు, పౌడాల లక్ష్మి, బడుగు యాదగిరి, రాపోలు విశ్వనాథం, ఏలే వెంకటనర్సు, గజం సత్యనారాయ, తుంగ శివ, కొంగరీ వెంకటేశం, గోషిక రథ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ గారికి ఘన నివాళి

**మోత్కూర్, జూన్ 23,వెలుతురు న్యూస్ :**

భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, ప్రముఖ జాతీయవాది నాయకుడు శ్రీ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ గారి వర్ధంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ మోత్కూరు పట్టణ శాఖ ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల మురళీధర్ రెడ్డి,పట్టణ అధ్యక్షులు చాలా మంజుల రెడ్డి మాట్లాడుతూ దేశ సమైక్యత, జాతీయ సమగ్రత కోసం డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఒకే దేశంలో రెండు విధానాలు, రెండు జెండాలు, ఇద్దరు ప్రధానులు ఉండరాదు అనే ఆయన నినాదం దేశ సమైక్యతకు ప్రతీకగా నిలిచిందని



పేర్కొన్నారు.దేశ ప్రయోజనాల కోసం ఆయన చేసిన త్యాగాలు యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. భారతదేశ అభివృద్ధి, జాతీయవాద భావజాల బలోపేతానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు.ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు . ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కోశాధికారి గుజ్జ సోమ నరసయ్య మాజీ రైల్వే బోర్డు మెంబర్ కొనతం నాగార్జున రెడ్డి ,జిల్లా నాయకులు గౌరు శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు జితేందర్ రెడ్డి, పట్టణం మాజీ అధ్యక్షులు పోచం సోమయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శులు జినుకల దశరథ అన్నెపు సత్యనారాయణ, నాయకులు చేకూరి మల్లేశం, కిసాన్ మండల అధ్యక్షులు భీమిడి తిరుమల్ రెడ్డి, బద్దం మహేందర్ రెడ్డి, నరుకుడు బిందెల శ్రీను, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మృతుదేవాలకు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**రామన్నపేట వెలుతురు జూన్ 23:**



రామన్నపేట మండలం నీర్నాముల గ్రామానికి చెందిన కన్నిబోయిన కిష్టయ్య మరణించగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. మంగళవారం రోజున రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన కొంచెం మైత్రి మరణించగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మృతదేవానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించడం జరిగింది. కార్యక్రమంలో టిఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు పోష బోయిన మల్లేశం. ఇంద్రపాలనగరం సర్పంచ్ గర్దాసు విక్రమ్.పల్లివాడ సర్పంచ్ కంభంపాటి శ్రీనివాసు గౌడ్ మాజీ ఎంపీటీసీలు పున్న వెంకటేశం, వేమవరం సుధీర్ బాబు, ఎండి ఆమీర్ నాయకులు జెట్టి శివప్రసాద్ యాదవ్, ఆవుల భగవంతు, బొల్లం సతీష్, ఆవుల లక్ష్మీనారాయణ, చిన్నపాక రమేష్, ఆవుల శ్రీధర్, నోముల లింగస్వామి, సాగర్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం సూచించిన ఏడు రకాల సన్న వడ్లకే బోనస్

**మోత్కూర్, జూన్ 23, వెలుతురు న్యూస్ :**

ప్రభుత్వం సూచించిన వరి సన్న రకాలను సాగు చేసి ప్రయోజనం పొందాలని పిఏసిఎస్ చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు,ఏ.ఓ. కీర్తి తెలిపారు.మోత్కూర్ మండలంలోని అనాజీపురం రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని పిఏసిఎస్ చైర్మన్, స్థానిక సర్పంచ్ లు ప్రారంభించారు.రైతులకు పలు రకాల విత్తనాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన వరి రకాలను మాత్రమే సాగు చేయాలని, వర్షాధారిత పరిస్థితులను బట్టి స్వల్పకాలిక లేదా మధ్యకాలిక పంటలను ఎంచుకోవాలన్నారు.ప్రభుత్వం ఎంపిక చేసిన ఏడు వరి రకాలను సాగు చేయాలని,వాటికే ప్రభుత్వం రూ.500 బోనస్ అందిస్తుందని తెలిపారు.నీటి ఎద్దడి ఉన్నప్పుడు పప్పుధాన్యాలు సాగు చేయాలని సూచించారు.యూరియాను సిఫార్సు చేసిన మోతాదులో




పలు దఫాలుగా వాడాలని రైతులను కోరారు.ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు యంత్రాంగం పక్కా ప్రణాళికతో సిద్ధంగా ఉందన్నారు.రైతులు అంతర పంటలు,తక్కువ నీటితో పండే పంటల వైపు మొగ్గు చూపాలని కోరారు.రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా, కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా బిల్లు, విత్తన ట్యాగ్ లను తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీసు వెంకటయ్య,ఏ ఈ ఓ లు ఆర్ సింహ ప్రసాద్,జి సోమప్ప,జి కళ్యాణి ,ఉపసర్పంచ్, స్థానికులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయం అందజేత

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 23:**



పట్టణానికి చెందిన యువకుడు మహమ్మద్ యాకూబ్ షరీఫ్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. తన వంతు సహాయం టిఆర్ఎస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు, టీయూఎఫ్ ఉద్యమ నేత, హంస ఫౌండేషన్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ చాంద్ వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం అరకింటల్ బియ్యం, రూ 2000/_ రూపాయలు నగదు అందజేశారు. ప్రభుత్వం వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మాజీ ఎంపిటిసి ఎండి అమేర్ ,ఎండి ముషబ్ , మరియు ఎండి గౌస్, ఎండి సల్మాన్, దండిగ మని తదితరులు పాల్గొన్నారు.

# యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**మోత్కూర్ పోలీస్.**

**మోత్కూర్, జూన్ 23,వెలుతురు న్యూస్ :**

మంగళవారం నాడు మోత్కూర్ పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజీ హాస్టల్ వద్ద మోత్కూర్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మోత్కూర్ ఇన్స్పెక్టర్ సి. వెంకటేశ్వర్లు , ఎస్.ఐ కె. సతీష్ మరియు ఎ.ఎస్.ఐ పాల్గొని విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. డ్రగ్స్‌కు బానిసైతే ఆరోగ్యం, విద్య, కుటుంబ జీవితం మరియు భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, మంచి అలవాట్లు అలవరచుకోవాలని సూచించారు.మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు పిలుపునిచ్చారు.అనంతరం విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడి వారిలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించారు. విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి కనబరుస్తూ శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవాలని, క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు



ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# విత్తన మేళా - రైతులకు ఆహ్వానం.

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 23:**



ప్రభుత్వ నిర్ణయం మేరకు 23.06.2026 నుండి 30.06.2026 వరకు రామన్నపేట మండలంలోని రామన్నపేట రైతు వేదిక మరియు వెల్లంకి రైతు వేదికలలో విత్తన మేళా నిర్వహించబడనుంది.ఈ మేళాలో ప్రభుత్వం సూచించిన 7 సన్న రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉంటాయి. రైతులు తమకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను ఒకే చోట కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించబడింది.కావున రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విత్తన మేళాలో పాల్గొని తమకు కావలసిన విత్తనాలను కొనుగోలు చేసుకోవలసిందిగా కోరడమైనది. వ్యవసాయ శాఖ రామన్నపేట మండలం యాదాద్రి భువనగిరి జిల్లా.

# రాజకీయాల్లో గెలుపోటములు సహజం.. ఓటమితో నిరాశ చెందొద్దు

- ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు...

**జహీరాబాద్ వెలుతురు జూన్ 23:**



ఇటీవల జరిగిన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి చెందిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు మంగళవారం పరామర్శించారు. 18వ వార్డు అభ్యర్థి నసీర్, 21వ వార్డు అభ్యర్థి సిఫలియ–శ్యామ, 22వ వార్డు అభ్యర్థి ముర్తుజా నివాసాలకు వెళ్లిన ఎమ్మెల్యే వారితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.ఈ సందర్భంగా వారి సమస్యలు, ఎన్నికల అనంతర పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ ఎల్లప్పుడూ తమ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటుందని, ఎలాంటి పరిస్థితుల్లోనూ నిరాశ చెందాల్సిన అవసరం లేదని వారికి భరోసా కల్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ రాజకీయాల్లో గెలుపోటములు సహజ ప్రక్రియ అని పేర్కొన్నారు. ఓటమిని అంతిమంగా భావించకుండా, దానిని ఒక పాఠంగా తీసుకుని మరింత పట్టుదలతో ప్రజల్లో పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం ఆయా వార్డుల్లో ఎమ్మెల్యే పర్యటించి స్థానికులతో మాట్లాడారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుధ్యం తదితర సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తంజిం, యువ నాయకుడు కొనింటి మిథున్‌రాజ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# అనాధలకు పూర్తిగా ఉచిత విద్య.. సెమీ ఆర్ఫన్ విద్యార్థులకు 50% ఫీజు రాయితీ

- బృంగి ఇంటర్నేషనల్ స్కూల్ వినూత్న నిర్ణయం....
- ఆర్థిక ఇబ్బందులతో ఏ చిన్నారి విద్యకు దూరం కాకూడదనే లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమం...

**జహీరాబాద్ వెలుతురు జూన్ 23:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని బృంగి ఇంటర్నేషనల్ స్కూల్ సామాజిక బాధ్యతలో భాగంగా అనాధ విద్యార్థులకు పూర్తిగా ఉచిత విద్యను అందించనున్నట్లు పాఠశాల యాజమాన్యం ప్రకటించింది. అలాగే తల్లి లేదా తండ్రిలో ఒకరిని కోల్పోయిన సెమీ ఆర్ఫన్ విద్యార్థులకు పాఠశాల ఫీజులో 50 శాతం రాయితీ కల్పించనున్నట్లు వెల్లడించింది.నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్న బృంగి ఇంటర్నేషనల్ స్కూల్, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఏ చిన్నారి కూడా విద్యకు దూరం కాకూడదనే సంకల్పంతో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపింది. ఆధునిక బోధనా విధానాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, క్రమశిక్షణతో కూడిన విద్యా వాతావరణం, విద్యతో పాటు క్రీడలు, వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత కల్పిస్తూ విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు పేర్కొంది.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని గ్రామ పెద్దలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తమ గ్రామాల్లోని అనాధ మరియు సెమీ ఆర్ఫన్ విద్యార్థులను గుర్తించి, వారి వివరాలను పాఠశాల యాజమాన్యానికి అందజేసి అడ్మిషన్ పొందేలా సహకరించాలని యాజమాన్యం కోరింది.అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు లేదా సంరక్షకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 96520 84901, 93810 19475 నంబర్లను సంప్రదించాలని పాఠశాల యాజమాన్యం సూచించింది.

# జహీరాబాద్‌లో ఘనంగా డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ నిర్వహణ

**జహీరాబాద్ వెలుతురు జూన్ 23:**



భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక నాయకుడు, గొప్ప దేశభక్తుడు డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్‌ను సోమవారం జహీరాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు పూల సంతోష్ ఆధ్వర్యంలో పట్టణ బీజేపీ కార్యాలయంలో డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దేశ సమైక్యత, జాతీయ సమగ్రత, అఖండ భారత నిర్మాణం కోసం డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశ ప్రయోజనాల కోసం ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని, యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జాతీయవాద భావజాలం, దేశభక్తి, ప్రజాసేవ పట్ల ఆయన చూపిన నిబద్ధత ప్రతి కార్యకర్తకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథ్, జిల్లా ఉపాధ్యక్షులు గొల్ల భాస్కర్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, సుధీర్ బండారి, విజేందర్ రెడ్డి, ప్రొద్దుటూరు శ్రీనివాస్ గుప్తా, బీజేపీ కౌన్సిలర్ బొగ్గుల సంతోష్, లింగన్న, విజయ్ కుమార్, సోమ అనిల్, అరుణ్ కుమార్, నరేష్ పాటిల్, అనిరుధ్ రెడ్డి, అప్పం రమేష్, అప్సర్, దిల్దార్, బసవరాజ్, చందు తదితరులు పాల్గొన్నారు.

# శ్యాం ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం

- మెదక్ జిల్లా బిజెపి నాయకులు కోణం విట్టల్

**వెలుతురు నారాయణఖేడ్ జూన్ 23 :**

మెదక్ జిల్లా :– నారాయణఖేడ్ నియోజకవర్గం పెద్ద శంకరంపేట్ భారతీయ జనసంఘ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయమని మెదక్ జిల్లా బిజెపి నాయకులు కోణం విఠల్ అన్నారు. మంగళవారం శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా పెద్ద శంకరంపేటలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కోణం విట్టాలు మాట్లాడుతూ దేశ సమగ్రత కోసం పోరాడిన వ్యక్తి అని ఆయన సేవలను కొనియాడారు. ఒకే దేశం, ఒకే రాజ్యాంగం కోసం శ్యాం ప్రసాద్ ముఖర్జీ పోరాటం చేశారని పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్. ప్రధాన కార్యదర్శి ఎం కృష్ణ. బి జె వై ఎమ్ అధ్యక్షుడు బుగుడాల కృష్ణ. నాయకులు వెంకయ్య ఆంజనేయులు సురేష్ భూషణం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు ఆరోగ్యానికి చాలా మంచివి: మెదక్ జిల్లా విద్యాధికారి ఎస్ రాజు

**చేగుంట వెలుతురు జూన్ 23:**



అంతర్జాతీయ ఒలంపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగా కరణం గణేష్ ఆధ్వర్యంలో చేగుంట పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుండి గాంధీ ఒలంపిక్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన సర్పంచ్ స్రవంతి, జిల్లా విద్యాధికారి ఎస్ రాజు, మండల విద్యాధికారి నీరజ.ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రాజు మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు చాలా ముఖ్యమైనవని, అందుకే ప్రభుత్వ పాఠశాలలో రోజు క్రీడలకు ఒక పిరియడ్ కేటాయిస్తున్నామని, ఒలంపిక్ డేలో నేను పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని వారు అన్నారు.ఈ కార్యక్రమం లో , చేగుంట సర్పంచ్ స్రవంతి,ఎంఇఓ నీరజ, యోగ కోచ్ గణేష్,పెటా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ నాగరాజు, ఎస్ జీ ఎఫ్ సెక్రటరీ నాగరాజు, పీడీ శారదా, శంకర్, వ్యాయామ ఉపాధ్యాయులు నరేష్,గిరిజా , తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్,ఎస్ టి యు ప్రధాన కార్యదర్శి మనోహర్ రావు, తపస్ మండల అధ్యక్షులు రావుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# ఆల్గోల్‌లో అక్రమంగా SSV ఇన్‌ఫ్రా యూనిట్

- గ్రామ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం చేస్తున్నారా?
- అనుమతులు లేకుండానే నిర్వహణ...
- టీఆర్పి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి జ్యోతి పండాల్...

**జహీరాబాద్ వెలుతురు జూన్ 23:**







సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆల్గోల్ గ్రామంలో SSV ఇన్‌ఫ్రా పేరుతో నిర్వహిస్తున్న కాంక్రీట్, సిమెంట్ మిక్సింగ్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ గ్రామ ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి జ్యోతి పండాల్ ఆరోపించారు. గ్రామ మధ్యలో ఇటువంటి పరిశ్రమను ఏర్పాటు చేయడం వల్ల వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా జ్యోతి పండాల్ మాట్లాడుతూ, కాంక్రీట్, సిమెంట్ మిక్సింగ్ యూనిట్ల నుంచి వెలువడే సిమెంట్ ధూళి, ఇసుక కణాలు గ్రామంలోని ఇళ్లలోకి చేరుతున్నాయని, ప్రజలు వండుకునే ఆహార పదార్థాలపై కూడా ఈ ధూళి పేరుకుపోతుందని ఆరోపించారు. దీంతో గ్రామస్తులు శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.అలాగే, యూనిట్‌లో భారీ యంత్రాలు రాత్రి వేళల్లో పనిచేయడం వల్ల భయంకరమైన శబ్దాలు వస్తున్నాయని, గ్రామ ప్రజలు నిద్రలేమి, మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. గ్రామ ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాలను పరిగణనలోకి తీసుకోకుండా యూనిట్ నిర్వహించడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు.పరిశ్రమ నిర్వహణకు సంబంధించి తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నుంచి అవసరమైన అనుమతులు తీసుకోలేదని ఆరోపించిన జ్యోతి పండాల్, ఈ అంశంపై కాలుష్య నియంత్రణ మండలి ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేసిందని చెప్పారు. అయినప్పటికీ యాజమాన్యం నుంచి సరైన సమాధానం రాలేదని, ఇటీవల నిర్వహించిన టాస్క్ ఫోర్స్ యాక్షన్ కమిటీ సమావేశానికి కూడా స్పందన లేదని పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఈ యూనిట్‌ను వెంటనే ఆల్గోల్ గ్రామం నుంచి తరలించాలని, లేదంటే చట్టపరమైన చర్యలు చేపట్టి యూనిట్‌ను మూసివేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని జ్యోతి పండాల్ స్పష్టం చేశారు. అంతేకాకుండా, ఈ యూనిట్‌కు మద్దతు ఇస్తున్న రాజకీయ నాయకులు తమ వైఖరిని మార్చుకోవాలని, లేకపోతే వారి పేర్లను కూడా బహిరంగంగా వెల్లడిస్తానని హెచ్చరించారు.

# ఎస్ ఐ ఆర్ పై మైనారిటీలు ఆందోళన ,అపోహలను వీడండి

**బిజెపి మైనార్టీ మోర్చా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్**

**కరీంనగర్ వెలుతురు జూన్ 23:**

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (Special Intensive Revision – SIR) ప్రక్రియపై మైనారిటీ వర్గాల్లో ఉన్న అపోహలను వీడాలని బీజేపీ మైనారిటీ మోర్చా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ కోరారు. మంగళవారం కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో జన సంగ్ వ్యవస్థాపకులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి ముజీబ్ పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యాం ప్రసాద్ ముఖర్జీ కలలు కన్న ఒకే దేశం ఒకే రాజ్యాంగాన్ని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం ఈనెల 25 నుండి ప్రారంభం కాబోతున్న ఎస్ ఐ ఆర్ విషయంలో మైనార్టీ ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు ఒత్తిడికి గురికావద్దన్నారు.ఈ విషయంలో అనవసరమైన భయాందోళనలకు లోనుకావాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.అక్రమ ఓట్ల తొలగింపు ప్రక్రియ లో ముఖ్యంగా పరాయి దేశాల నుంచి వచ్చి, అక్రమంగా భారత దేశంలో ఓటు హక్కు పొందిన వారిని గుర్తించి, అటువంటి అక్రమ ఓట్లను తొలగించే అవకాశం మాత్రమే ఈ ప్రక్రియలో ఉందని ఆయన వివరించారు. దీనివల్ల భారతీయ పౌరులైన వారికి ఎటువంటి ఇబ్బంది కలగదన్నారు.ఎస్ ఐ ఆర్ అనేది ప్రతి 20 ఏళ్లకు ఒకసారి దేశవ్యాప్తంగా జరిగే సాధారణ ప్రక్రియ అని, దీనిని కేవలం పరిపాలనా పరమైన చర్యగా చూడాలని ఆయన సూచించారు. ఇది రాజకీయ కోణంలో చేసేది కాదని ఆయన స్పష్టం చేశారు. దేశ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా ఉంచేందుకు, అర్హులైన వారికే ఓటు హక్కు ఉండేలా చూడటానికి ఈ రివిజన్ చేపడుతున్నట్లు తెలిపారు. ఇది ఏ ఒక్క వర్గాన్ని లక్ష్యంగా చేసుకున్నది కాదని, కేవలం నిబంధనల మేరకు అక్రమ ఓట్లను తొలగించి, జాబితాను సరిచేసే ప్రక్రియ మాత్రమే నన్నారు. వదంతులను నమ్మవద్దని, వాస్తవాలను గ్రహించాలని ఆయన మైనారిటీ సోదరులకు విజ్ఞప్తి చేశారు.



# నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో దేశం ప్రగతి పథంలో ముందడుగు

- బీజేపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి రామన్ సింగ్
- ఘనంగా మోడీ 12 సంవత్సరాల పాలనా ఉత్సవాలు

**వెలుతురు నారాయణఖేడ్ జూన్ 23 :**





సంగారెడ్డి జిల్లా :- బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నారాయణఖేడ్ పట్టణంలోని శిశుమందిర్ పాఠశాలలో నిర్వహించడం జరిగింది.ఈసందర్భంగా రామన్ సింగ్, విజయపాల్ రెడ్డి మాట్లాడుతూ


భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతూ, ప్రగతి పథంలో ముందడుగు వేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి రామన్ సింగ్, మాజీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డి కొనియాడారు.నరేంద్ర మోడీ 12 సంవత్సరాల సుపరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నారాయణఖేడ్ లో ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణను కాంక్షిస్తూ నేతలు, కార్యకర్తలు చెట్లను నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రామన్ సింగ్, విజయపాల్ రెడ్డి మాట్లాడుతూ... <

మోడీ గారి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పేద, వెనుకబడిన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని పతాక స్థాయికి చేర్చారు. ఓబీసీల అభివృద్ధికి, దేశ భద్రతకు, ఆర్థిక రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రధాని తీసుకున్న నిర్ణయాలు చారిత్రాత్మకమని వారు కొనియాడారు. దేశ ప్రతిష్టను ప్రపంచ దేశాల ముందు అగ్రగామిగా నిలిపిన ఘనత నరేంద్ర మోడీ గారికే దక్కుతుందని స్పష్టం చేశారు. "మోడీ గారి 12 ఏళ్ల పాలన భారతదేశ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం.

దేశంలోని ప్రతి పౌరుడికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయి.ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పత్రి రామకృష్ణ, ఓబీసీ మోర్చా కన్వీనర్ కోణం విఠల్, రజినీకాంత్, మండల అధ్యక్షులు దశరథ్, పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, శంకరంపేట్ అధ్యక్షులు శ్రావణ్ సుధాకర్, ప్రశాంత్, పట్నం మాణిక్, అశోక్, వెంకటేష్, సాయందర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నరు.

# నగర పార్కులకు ఆధునిక డిజైన్లు రూపొందించాలి: కలెక్టర్

**హనుమకొండ, వెలుతురు జూన్ 23:**



నగర ప్రజలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంలో పార్కులు కీలక పాత్ర పోషిస్తాయని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. నగరవ్యాప్తంగా ఉన్న పార్కుల పురోగతి, అభివృద్ధిపై వరల్డ్ రీసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు, మున్సిపల్ అధికారులతో కలిసి కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె ఒక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నగరంలోని పార్కులను సుందరంగా తీర్చిదిద్దేందుకు వీలుగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆధునిక డిజైన్లను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.డబ్ల్యూఆర్ఐ సాంకేతిక సహకారంతో బాలసముద్రంలో అభివృద్ధి చేసిన చిల్డ్రన్స్ పార్క్ ప్రస్తుతం ఒక మోడల్ ప్రాజెక్ట్‌గా నిలిచిందని కలెక్టర్ అభినందించారు.

ఇదే తరహా సాంకేతిక సహాయాన్ని నగరంలోని ఇతర పార్కుల అభివృద్ధికి కూడా ఉపయోగించుకోవాలని సూచించారు. వరంగల్ పరిధిలోని కీర్తినగర్ పార్కుతో పాటు ఇతర పార్కులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల సమగ్ర అభివృద్ధి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో చేపట్టే ప్రాజెక్టులు ప్రజల అవసరాలు, పిల్లల ఆటపాటలు, మరియు పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని రూపొందించాలని స్పష్టం చేశారు.పట్టణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించడం అత్యంత అవసరమని, ఇందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ కోరారు. నగర పార్కుల అభివృద్ధికి తమ వంతు సాంకేతిక సహకారాన్ని అందిస్తామని డబ్ల్యూఆర్ఐ ప్రతినిధులు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ సమావేశంలో డబ్ల్యూఆర్ఐ కన్సల్టెంట్ ప్రతినిధి ఎలైన్ అజిత్, జీడబ్ల్యూఎంసీ సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్, సంతోష్ బాబు, డిప్యూటీ ఇంజనీర్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బాసరలో అర్ధరాత్రి దొంగల బీభత్సం

- మహంకాళి అమ్మవారి ఆలయంలో చోరీ
- వెండి కిరీటం, హుండీతో పరారీ
- వ్యాసగుడి వద్ద ఖాళీ హుండీ లభ్యం
- నిత్య పూజల వేళ వెలుగులోకి ఘటన
- సీసీటీవీ, క్లూస్ టీమ్స్ ఆధారంగా విచారణ

**బాసర వెలుతురు జూన్ 23:**

తెలంగాణలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిన నిర్మల్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భారీ చోరీ జరిగింది. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని దుండగులు ఆలయ ఆవరణలోకి చొరబడి పక్కా స్కెచ్‌తో ఈ దొంగతనానికి పాల్పడ్డారు. సరస్వతీ దేవి ఆలయ పైఅంతస్తులో కొలువై ఉన్న శ్రీ మహంకాళి అమ్మవారి గుడిని టార్గెట్ చేసిన దొంగలు.. లోపలికి చొరబడి అమ్మవారి వెండి కిరీటం, భక్తులు కానుకలు సమర్పించే హుండీని ఎత్తుకెళ్లారు. భక్తులు ఎంతో పవిత్రంగా భావించే ఈ పుణ్యక్షేత్రంలో ఇలాంటి ఘటన జరగడం స్థానికంగా, భక్తజనాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ఆలయంలోని భద్రతా లోపాలు ఈ ఘటనతో ఒక్కసారిగా వెలుగులోకి వచ్చాయి.ఆలయ వర్గాల కథనం ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగలు మహంకాళి ఆలయ పరిసరాల్లో సంచరించారు. చుట్టుపక్కల ఎవరూ లేని సమయం చూసి, గుడి ప్రధాన గేటుకు ఉన్న తాళాలను రాడ్లతో పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. నేరుగా గర్భగుడిలోకి చొరబడిన దుండగులు అమ్మవారి ప్రధాన అలంకరణకు ఉపయోగించే వెండి కిరీటాన్ని దొంగిలించారు. ఆలయంలో సెక్యూరిటీ సిబ్బంది ఉన్నప్పటికీ దొంగలు ఎంతో చాకచక్యంగా లోపలికి వెళ్లడం గమనార్హం.అమ్మవారి వెండి కిరీటాన్ని తీసుకున్న దొంగలు, అంతటితో ఆగకుండా భక్తులు సమర్పించిన కానుకలతో నిండి ఉన్న ఆలయ హుండీని సైతం అలాగే నేల నుంచి పెకలించి ఎత్తుకెళ్లారు. ఆ తర్వాత ఆలయ ప్రాంగణం వెలుపలికి వెళ్లిన దొంగలు.. నిర్మానుష్య ప్రాంతంలో హుండీ తాళాలు పగలగొట్టి అందులోని నగదు మొత్తాన్ని కాజేశారు. అనంతరం ఖాళీ అయిన హుండీ ఇనుప పెట్టెను సమీపంలోని వ్యాసగుడి వద్ద పడేసి.. అక్కడి నుంచి రాత్రి చీకట్లోనే పరారయ్యారు.మంగళవారం తెల్లవారుజామున ఆలయ అర్చకులు నిత్య పూజల నిర్వహణ కోసం ఆలయానికి వచ్చారు. సరస్వతీ అమ్మవారి సుప్రభాత సేవ ముగించుకుని, పైఅంతస్తులోని మహంకాళి గుడికి వెళ్లడంతో ఈ దొంగతనం ఘటన మొదటిసారిగా వెలుగులోకి వచ్చింది. ఆలయ సింహద్వారం గేటు విరిగిపోయి ఉండటం, గర్భగుడిలో పూజా సామాగ్రి అంతా చెల్లాచెదురుగా పడి ఉండటం చూసి అర్చకులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.గర్భగుడిలో అమ్మవారి వెండి కిరీటం, హుండీ మాయమైనట్లు స్పష్టంగా గుర్తించిన అర్చకులు వెంటనే ఈ



విషయాన్ని ఆలయ ఉన్నతాధికారులకు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో)కు చేరవేశారు. ఆలయ అధికారులు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఈ దొంగతనంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును ముమ్మరం చేశారు. ముందస్తు ఆధారాల కోసం ప్రత్యేక క్లూస్ టీమ్స్, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. ఘటనా స్థలంలో దొంగలకు సంబంధించిన వేలిముద్రలను, ఇతర సాక్ష్యాలను క్లూస్ టీమ్స్ సేకరిస్తున్నాయి. పోలీస్ కుక్కలు ఆలయ ప్రాంగణం నుంచి హుండీ పారేసిన వ్యాసగుడి వరకు పరిగెత్తి ఆగిపోయాయి.ఆలయ ప్రాంగణంలో గట్టి నిఘా ఉన్నప్పటికీ దొంగలు ఇంత సాహసానికి ఒడిగట్టడంపై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆలయంలోపల, వెలుపల వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు నిశితంగా పరిశీలిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో ఆలయ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరిగిన వ్యక్తుల కదలికలను రికార్డుల ద్వారా గుర్తిస్తున్నారు.బాసర లాంటి పెద్ద ఆలయంలో నిరంతరం భద్రతా సిబ్బంది కాపలా ఉంటారు. అంతటి నిఘా వ్యవస్థను దాటుకుని దొంగతనం జరగడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతర్గత భద్రతా సిబ్బంది ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం వహించారా? లేదా ఆలయ పరిసరాలపై పూర్తి అవగాహన ఉన్న స్థానికుల హస్తం ఏదైనా ఉందా? అనే కోణంలో కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.దేశం నలుమూలల నుండి అక్షరాభ్యాసాల కోసం నిత్యం వేలాది మంది భక్తులు వచ్చే బాసర క్షేత్రంలో ఇలాంటి దొంగతనం జరగడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఆలయ భద్రతా లోపాలపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆలయ అధికారులు స్పందించి, బాసర క్షేత్రంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని, మరిన్ని అధునాతన నిఘా కెమెరాలు ఏర్పాటు చేయాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# జూన్ 29న ఛలో మహబూబాబాద్

- ఐక్యతతోనే బహుజనులకు రాజ్యాధికారం
- మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి
- మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు పిలుపు
- ప్రతి నియోజకవర్గంలో 50 వేలకుపైగా మాదిగ ఓటర్లు
- మాదిగల ఓట్లు మాదిగలకే వేస్తేనే తలరాతలు మారతాయి

**హైదరాబాద్ వెలుతురు జూన్ 23:**

బహుజన సమాజానికి రాజకీయ అధికారం దక్కాలంటే ఐక్యతే ప్రధాన ఆయుధమని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. మాదిగల రాజకీయ, సామాజిక సాధికారత కోసం సమిష్టిగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని మాదిగ మహాశక్తి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 29న మహబూబాబాద్ జిల్లాలో నిర్వహించనున్న మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని భారీ ఎత్తున విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగల ఓట్లు మాదిగలకే అనే నినాదంతో మాదిగ మహాశక్తి చేపడుతున్న కార్యక్రమాలు సామాజిక చైతన్యానికి నాంది పలుకుతాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మాదిగలు, బహుజన వర్గాలు రాజకీయంగా చైతన్యవంతమై తమ ఓటు శక్తిని గుర్తించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలకు పైగా గడిచినా మాదిగల జీవన పరిస్థితుల్లో ఆశించిన మార్పు రాలేదని మోత్కుపల్లి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో దాదాపు 70 లక్షల మంది మాదిగలు ఉన్నప్పటికీ, వారి జనాభాకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం, అధికార భాగస్వామ్యం లభించడం లేదని పేర్కొన్నారు. అధికార వ్యవస్థలో



అగ్రకులాల ఆధిపత్యం కొనసాగుతుండగా, బహుజన వర్గాలను కేవలం ఓటు బ్యాంకులుగా మాత్రమే ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. మాదిగలు తమ ఓట్ల విలువను గుర్తించి, ఐక్యంగా వ్యవహరిస్తే రాష్ట్ర రాజకీయాల్లో కీలక శక్తిగా ఎదగగలరని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 50 వేలకుపైగా మాదిగ ఓటర్లు ఉన్నారని, ఈ ఓటు శక్తి ఏ ఎన్నికలోనైనా ఫలితాలను ప్రభావితం చేసే స్థాయిలో ఉందని అన్నారు. మాదిగలు తమ ఓట్లను తమ నాయకత్వానికి వినియోగించుకుంటే వారి రాజకీయ సామర్థ్యం ఏమిటో రాష్ట్రానికి తెలుస్తుందని వ్యాఖ్యానించారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, ఇతర బహుజన వర్గాల మద్దతుతో మాదిగలు రాజకీయ అధికారాన్ని సాధించే అవకాశం ఉందని మోత్కుపల్లి పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజకీయ భాగస్వామ్యం కోసం బహుజన వర్గాలు ఒకే వేదికపైకి రావాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్ల ద్వారా లభించాల్సిన ప్రయోజనాలు అర్హులైన వర్గాలకు పూర్తిస్థాయిలో అందడం లేదని ఆయన ఆరోపించారు. పాలకులు నిర్లక్ష్య వైఖరితో వ్యవహరించడం వల్ల వెనుకబడిన వర్గాల అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగడం లేదన్నారు. సంక్షేమ పథకాలు, విద్యా అవకాశాలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల అమలు విషయంలో మరింత చిత్తశుద్ధి అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కూడా మోత్కుపల్లి విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్సీ వర్గాలన్నింటికీ సమాన అవకాశాలు లభించడం లేదని, ముఖ్యంగా మాల కుటుంబాలకే ఎక్కువగా ఎన్నికల టికెట్లు, మంత్రి పదవులు దక్కుతున్నాయని ఆరోపించారు. ఎస్సీ వర్గాల్లోని అన్ని ఉపకులాలకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మాదిగ మహాశక్తి జెండా రాష్ట్రవ్యాప్తంగా ఎగరాలని, సామాజిక న్యాయం కోసం జరుగుతున్న ఈ ఉద్యమాన్ని ప్రతి మాదిగ కుటుంబం తమ ఉద్యమంగా భావించి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల ఆత్మీయ సమ్మేళనం మాదిగల ఐక్యతకు, రాజకీయ చైతన్యానికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మాదిగ మహాశక్తి నాయకులు, కార్యకర్తలు కూడా మహబూబాబాద్ సమ్మేళనాన్ని చారిత్రాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మాదిగల సమస్యలు, రాజకీయ హక్కులు, సామాజిక సాధికారత అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు.

# జిల్లా ఆరోగ్య సూచికల మెరుగుదలకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి

- జిల్లా కలెక్టర్ & జిల్లా ఆరోగ్య సంఘం అధ్యక్షులు సి.నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూన్ 23:**

రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (IDOC), కొంగరకలాన్‌లో మంగళవారం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఆరోగ్య సంఘం (District Health Society) అధ్యక్షులు సి. నారాయణ రెడ్డి గారి అధ్యక్షతన జిల్లా ఆరోగ్య సంఘం సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ స్వర్ణ కుమారి గారు కన్వీనర్‌గా వ్యవహరించారు.ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య మిషన్ (National Health Mission–NHM) పరిధిలో జిల్లాలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ముఖ్యంగా మాతా–శిశు ఆరోగ్య సేవలు (MCH), గర్భిణీ స్త్రీల ఆరోగ్య సంరక్షణ, సంస్థాగత ప్రసవాలు, నవజాత శిశువుల ఆరోగ్య సేవలు, టీకా కార్యక్రమాలు, పోషకాహార లోప నివారణ, ఆరోగ్య సూచికల మెరుగుదల వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అధిక ప్రమాద గర్భిణీల (High Risk Pregnancies) గుర్తింపును మరింత సమర్థవంతంగా చేపట్టి, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన వైద్య సేవలు, ప్రత్యేక వైద్య పరీక్షలు, రిఫరల్ సేవలను సకాలంలో అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మాతా–శిశు మరణాల రేటును తగ్గించేందుకు ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు.జిల్లాలో క్షయవ్యాధి (Tuberculosis–TB) నిర్మూలన లక్ష్య సాధనలో భాగంగా టీబీ కేసుల గుర్తింపు, పరీక్షలు, చికిత్స, పోషకాహార సహాయం, ఫాలోఅప్ సేవలను మరింత పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి టీబీ రోగి పూర్తి చికిత్స పొందేలా చర్యలు తీసుకుని జిల్లాను టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు.వర్షాకాలం నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా, చికున్గున్యా, వైరల్ ఫీవర్స్, నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు తదితర సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్ర



మాలను బలోపేతం చేయడంతో పాటు నిల్వ నీరు లేకుండా చర్యలు చేపట్టాలని, దోమల నివారణ కార్యక్రమాలు, ఫాగింగ్, అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ శాఖ సమన్వయంతో పనిచేసి ప్రజారోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు.జిల్లాలో హెచ్.పి.వి.(HPV) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసి నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. అర్హులైన బాలికలకు వ్యాక్సిన్ అందేలా విద్యాశాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ నెల 28వ తేదీ ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లాలోని ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి పోలియో చుక్కలు అందేలా సమగ్ర కార్యాచరణ రూపొందించి, ఏ ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.జిల్లాలో ప్రజారోగ్య సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు ఆరోగ్య సూచికల మెరుగుదలకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడం జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి గారు పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా కోఆర్డినేటర్ (హాస్పిటల్ సర్వీసెస్) డాక్టర్ అనురాగిణి గారు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది మరియు ఇతర శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.



# భార్యను కోల్పోయి ఒంటరైన వృద్ధుడికి చేయూత...మానవత్వం చాటుకున్న సమ్మన్న

- ఆపదలో ఉన్న వృద్ధుడికి ఆధారంగా నిలిచిన సమ్మిగౌడ్ ఫౌండేషన్
- ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తంగా సమ్మిగౌడ్, ఎమ్మార్పీఎస్ నాయకులు అరుణ్, వెంకన్న

**కేసముద్రం వెలుతురు జూన్ 23:**



కేసముద్రం మండలంలోని జమలాపురం గ్రామానికి చెందిన బచ్చాల వెంకటయ్య, సుశీల దంపతులు ఎంతో పేదరికంలో జీవనం సాగిస్తున్న వృద్ధ దంపతులు. కూలీ పనులు చేసుకుంటూ వచ్చిన కొద్దిపాటి ఆదాయంతో జీవనం కొనసాగించేవారు. వృద్ధాప్యంలో ఒకరికి ఒకరు తోడుగా ఉంటూ కష్టసుఖాలను పంచుకుంటూ జీవిస్తున్న ఈ దంపతుల జీవితంలో ఇటీవల విషాదం చోటుచేసుకుంది..అనారోగ్యంతో బాధపడుతున్న బచ్చాల సుశీల గారు మృతి చెందడంతో ఆమె భర్త బచ్చాల వెంకటయ్య జీవిత భాగస్వామిని కోల్పోయి తీవ్ర మనోవేదనలో మునిగిపోయారు. జీవితాంతం తనకు తోడుగా ఉంటుందని భావించిన భార్యను కోల్పోవడంతో ఆయన పూర్తిగా ఒంటరిగా మారిపోయారు. ఒకప్పుడు ఇద్దరూ కలిసి కష్టపడి జీవితం గడిపిన ఆ ఇంట్లో నేడు ఆమె జ్ఞాపకాలు మాత్రమే మిగిలాయి. ఇప్పటికే ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం కావడంతో వెంకటయ్య గారి పరిస్థితి మరింత దయనీయంగా మారింది.ఈ విషయం సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిలువేరు సమ్మిగౌడ్ గారి దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించారు. తాను అందుబాటులో లేకపోయినప్పటికీ ఫౌండేషన్ సభ్యులను పంపించి బచ్చాల వెంకటయ్య గారికి బియ్యం మరియు నిత్యావసర సరుకులను అందజేసి తన మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు. అంతేకాకుండా బాధలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మార్పీఎస్ నాయకులు కే. అరుణ్, వెంకన్న సమ్మిగౌడ్ ఫౌండేషన్ సేవలను గురించి మాట్లాడుతూ, "జమలాపురం



గ్రామానికి చెందిన అనేక నిరుపేద కుటుంబాలకు గతంలో కూడా సమ్మిగౌడ్ గారు ఎన్నో సందర్భాల్లో సహాయం చేశారు. ఎవరి ఇంట్లో ఏ కష్టం వచ్చినా, ఆ కుటుంబానికి అండగా నిలవడం ఆయన ప్రత్యేకత. ఇప్పుడు వృద్ధ దంపతులలో సుశీల గారు మృతిచెందడంతో వెంకటయ్య గారు ఒంటరిగా మిగిలిపోయారని తెలుసుకున్న వెంటనే సమ్మిగౌడ్ గారు స్పందించారు. తాను అందుబాటులో లేకపోయినప్పటికీ తన ఫౌండేషన్ సభ్యులను పంపించి బియ్యం, నిత్యావసర సరుకులు అందజేయడం ఆయన సేవా తత్వానికి నిదర్శనం" అని అన్నారు..అలాగే, "పేదల కష్టాన్ని తన కష్టంగా భావిస్తూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు చేయూతనివ్వడం సమ్మిగౌడ్ గారి గొప్ప మనసుకు నిదర్శనం. రాజకీయాలు, కులాలు, పార్టీలకు అతీతంగా మానవత్వంతో సేవలు అందిస్తూ ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. అవసరం వచ్చిన ప్రతిసారి ముందుండి స్పందించడం వల్లే సమ్మిగౌడ్ గారు ప్రజల మనిషిగా గుర్తింపు పొందారు" అని కొనియాడారు.ఈ పరామర్శ కార్యక్రమంలో అరుణ్, వెంకన్న, భాస్కర్, యాకుబ్, ప్రభాకర్, కళ్యాణ్, బాషా,మానెమ్మ, వెంకటమ్మ,సుశీల,ఎల్లమ్మ, పద్మ, వెంకటలక్ష్మి , మాధవి,క్రీస్తుమణి, శరణ్య. ప్రీతి,మానెమ్మ, ఫౌండేషన్ సభ్యులు,చిలువేరు సమ్మయ్య గౌడ్ అభిమానులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)-2026లో మొదటి దశ అత్యంత కీలకం

- **జిల్లా ఎన్నికల అధికారి & కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూన్ 23:**

మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)-2026 కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)-2026 కార్యక్రమంలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు నిర్వహించే హౌస్-టు-హౌస్ ఎన్యుమరేషన్ ప్రక్రియ అత్యంత కీలకమని జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారమ్‌ల ముద్రణ, పంపిణీ, శిక్షణ కార్యక్రమాలు పూర్తయ్యాయని, అన్ని మండలాలకు అవసరమైన ఫారమ్‌లు, ఓటరు జాబితాలు అందజేయడం జరిగిందని తెలిపారు. బీఎల్‌ఓలు, బీఎల్‌ఓ సూపర్వైజర్లు, పీఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ఈఆర్‌ఓలకు అవసరమైన శిక్షణ పూర్తి చేసినట్లు చెప్పారు. జూన్ 25 నుంచి ప్రారంభమయ్యే హౌస్-టు-హౌస్ కార్యక్రమంలో ప్రతి ఓటరికి తప్పని సరిగా ఎన్యుమరేషన్ ఫారమ్ అందజేయాలని, ఇంట్లో లేని సందర్భాల్లో కనీసం మూడు సార్లు సందర్శించి ఫారమ్ అందించే ప్రయత్నం చేయాలని ఆదేశించారు. ఫారమ్ అందించినట్లు రసీదు లేదా తగిన ఆధారాలు ఉండాలని పేర్కొన్నారు.2002 ఓటరు జాబితాలో పేరు ఉన్న అర్హులైన ఓటర్లకు ఈ దశలో ఎటువంటి సహాయక పత్రాలు (Supporting Documents) అడగాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాను 2002 జాబితాతో మ్యాపింగ్ చేసి, వివరాలను ధృవీకరించి సంతకం తీసుకుంటే సరిపోతుందని తెలిపారు. ఓటర్లకు సంబంధించిన వివరాలు CEO Telangana, ECI మరియు Voters.eci.gov.in వెబ్‌సైట్‌లలో సులభంగా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జూలై 31న ప్రచురించే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఎన్యుమరేషన్ ఫారమ్‌లు సమర్పించిన వారి పేర్లు మాత్రమే ఉంటాయని, ఫారమ్‌లు సమర్పించని వారి పేర్లు డ్రాఫ్ట్ జాబితాలో కని పించకపోవచ్చని వివరించారు. అందువల్ల ఫారమ్ పంపిణీ, సరైన వివరాలతో నింపించడం, తిరిగి సేకరించడం అనే మూడు దశలను అత్యంత జాగ్రత్తగా పూర్తి చేయాలని సూచించారు.అర్బన్ ప్రాంతాల్లో షిఫ్టెడ్ ఓటర్లు, అద్దెకు నివసిస్తున్న వ్యక్తులు, కొత్తగా వచ్చిన




నివాసితుల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని, వారు ఇతర నియోజకవర్గాల్లో ఓటర్లుగా ఉంటే ఫారమ్-8 ద్వారా బదిలీ (Transfer) చేయించే చర్యలు చేపట్టాలని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడైన వ్యక్తికి ఫారమ్-6 అందించి కొత్తగా ఓటరుగా నమోదు చేయాలని ఆదేశించారు. ఎవరైనా ఓటరు నివాసం మార్చినట్లు, మర ణించినట్లు లేదా అక్కడ నివసించడం లేదని పేర్కొంటే దానికి తగిన ఆధారాలు, స్థానికుల స్టేట్‌మెంట్లు నమోదు చేయాలని సూచించారు. ఆధారాలు లేకుండా ఏ పేరును తొలగించరాదని స్పష్టం చేశారు.SIR కార్యక్రమంలో పనిచేస్తున్న బీఎల్‌ఓలు, సూపర్వైజర్లు, ఏఈఆర్‌ఓలు, ఈఆర్‌ఓలు తదితర అధికారులు రాబోయే మూడు నెలల పాటు ప్రధానంగా ఈ కార్యక్రమంపైనే దృష్టి సారించాలని, రాష్ట్ర ఎన్నికల సంఘం మరియు భారత ఎన్నికల సంఘం కూడా ఇదే మేరకు ఆదేశాలు జారీ చేశాయని తెలిపారు.ఈ SIR కార్యక్రమం విజయవంతం కావడానికి ఎన్నికల అధికారులు, బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పరస్పర సమన్వయంతో పని చేయాలని, ప్రతి అర్హత ఓటరిని చేరుకొని వారి వివరాలు సక్రమంగా నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి అనంత్ రెడ్డి, వికాస్ మహాతో, ఐఏఎస్, జోనల్ కమిషనర్, ఎల్.బి.నగర్ ఎంఎంసి, కె. పార్థసింహ రెడ్డి, ERO & RDO, చేవెళ్ళ, ఎన్.ఆర్.సరిత, ఈఆర్‌ఓ & ఆర్డీఓ, షాద్నగర్, వై. శ్రీనివాస్ రెడ్డి ERO & RDO, ఇబ్రహీంపట్నం, బి.ప్రేమ్ కుమార్, AMC/AERO, శేరి లింగంపల్లి ఎం.పి.జనార్ధన్ రెడ్డి, ఈఆర్‌ఓ & ఆర్డీఓ, కల్వకుర్తి, ఎన్.జగదీశ్వర్ రెడ్డి, ERO & RDO, కందుకూరు, ఎస్. శ్రీనివాస్ రెడ్డి, జోనల్ కమిషనర్ & ERO, రాజేంద్రనగర్, మహమ్మద్ తాహెర్ AIMIM, కలాం సుభాష్ రెడ్డి BRS, కె. వాసు బాబుBRS, ఎ.సూర్యం BRS, ఎ.బాబులాల్,ఆప్ ,పి.యాదయ్య సిపిఎం , ఎం.చంద్ర మోహన్ CPM,బి. సమీర్ సిపిఐ (ఎం),సి హెచ్.శంకర్ సిపిఐ (ఎం), కె బాల్ రాజ్ INC, పి.కిరణ్ కుమార్,BSP, ఈ. సంజీవా BSP, బి.నితిన్ కుమార్ BSP, కె. బహుగణ నాయక్ BSP, లాట్వీ రాజు BSP, జగన్ సిపిఐ (ఎం),సిహెచ్.బుగ్గి రాములు, సిపిఐ (ఎం) రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సాయికృష్ణ మిస్సింగ్ కేసులో సంచలనం

- **సిట్ అదుపులోకి సీఐ నాగరాజు**
- **విజయవాడలో తీవ్ర ఉద్రిక్తత**
- **సింగ్‌నగర్‌లో పోలీసుల తనిఖీలు**
- **పోలీసులను అడ్డుకున్న మద్దతుదారులు**
- **సాయికృష్ణ తల్లి ఫిర్యాదుతో కీలక చర్యలు**
- **హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్..**
- **జూన్ 29 లోగా హాజరుపరచాలని ఆదేశం**

**విజయవాడ వెలుతురు జూన్ 23:**

ఆంధ్రప్రదేశ్‌లో పెను సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు విచారణను మరింత వేగవంతం చేశారు. ఈ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటూ ఇప్పటికే సస్పెన్షన్‌కు గురైన కృష్ణలంక మాజీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజును సిట్ అధికారులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. విజయవాడ సింగ్‌నగర్‌లోని నాగరాజు నివాసానికి సిట్ అధికారులు వెళ్లిన సమయంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. సీఐ అరెస్ట్‌ను అడ్డుకునేందుకు ఆయన మద్దతుదారులు భారీగా తరలివచ్చి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చివరకు ఆందోళనకారులను చెదర గొట్టిన పోలీసులు నాగరాజును రహస్య ప్రాంతానికి తరలించి విచారిస్తున్నారు.గాదె సాయికృష్ణ పోలీసు కస్టడీలోనే మరణించాడనే ఆరోపణలపై పక్కా ఆధారాలు సేకరించిన సిట్ బృందం.. ఈరోజు విజయవాడ సింగ్‌నగర్ పరిధిలో ఉన్న సీఐ నాగరాజు స్వగృహానికి చేరుకుంది. నాగరాజు ఇంట్లో ఉన్నారనే సమాచారంతో అధికారులు అక్కడ సోదాలు నిర్వహించి, ఆయనను విచారణ నిమిత్తం తమ వెంట తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ విచారణ ప్రక్రియ స్థానికంగా పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా




మారింది.సిట్ అధికారులు నాగరాజును అదుపులోకి తీసు కుంటున్నారనే సమాచారం సింగ్‌నగర్‌లో వేగంగా వ్యాపించింది. దీంతో సీఐ నాగరాజుకు మద్దతుగా పెద్ద సంఖ్యలో ఆయన అనుచరులు, మద్దతుదారులు నివాస ప్రాంతానికి చేరుకున్నారు. పోలీసుల వాహనాలను ముందుకు కదగనివ్వకుండా అడ్డుకుంటూ ఆందోళనకు దిగారు. చట్ట వ్యతిరేకంగా సీఐని తీసుకెళ్తున్నారంటూ నినాదాలు చేయడంతో అక్కడ స్వల్ప ఉద్రిక్త వాతావరణం నెలకొంది.పరిస్థితి చేతులు దాటిపోతుండటంతో అదనపు పోలీసు బలగాలు రంగంలోకి దిగాయి. విధులకు ఆటంకం కలిగిస్తున్న నిరసనకారులను పోలీసులు తీవ్రంగా హెచ్చరించారు. అయినప్పటికీ వెనక్కి తగ్గని సీఐ మద్దతుదా రులను పోలీసులు లాఠీఛార్జ్ చేసి అక్కడి నుంచి చెదర గొట్టారు. అనంతరం ఎట్టకేలకు సీఐ నాగరాజును సిట్ అధికారులు తమ ప్రత్యేక వాహనంలో విచారణ కేంద్రానికి తరలించారు.బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మే 9వ తేదీన కృష్ణలంక పోలీసులు గాదె సాయికృష్ణను విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లిన రోజు నుంచి సాయికృష్ణ తిరిగి ఇంటికి రాలేదని, ఆయన ఆచూకీ పూర్తిగా గల్లంతైందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. స్టేషన్‌లో ఏం జరిగిందో చెప్పకుండా పోలీసులు దాటవేస్తూ వచ్చారని వారు వాపోతున్నారు.సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి పోలీసులపై అత్యంత తీవ్రమైన ఆరోపణలు చేశారు. అప్పటి కృష్ణలంక సీఐ నాగరాజు తన కుమారుడిని థర్డ్ డిగ్రీ ఉపయోగించి చిత్రహింసలు పెట్టారని, తీవ్రంగా కొట్టడం వల్లే సాయికృష్ణ లాకప్‌లోనే చనిపోయాడని ఆమె కన్నీరుమున్నీరయ్యారు. ఆ తర్వాత కృష్ణలంక పోలీసులే గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని ఎక్కడో పారవేసి మిస్సింగ్ డ్రామా ఆడుతు న్నారని ఆమె ఆరోపించారు.తన కుమారుడి ప్రాణాలకు ముప్పు ఉందని భావించిన తల్లి విజయలక్ష్మి న్యాయపోరా టానికి దిగారు. సాయికృష్ణను కోర్టు ముందు ప్రవేశపె ట్టాలంటూ ఏపీ హైకోర్టులో ఆమె 'హెబియస్ కార్పస్' పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం కేసును తీవ్రంగా పరిగణించింది. రాబోయే జూన్ 29వ తేదీ లోగా సాయికృష్ణను ఎట్టి పరిస్థితుల్లోనూ కోర్టు ముందు హాజరుపరచాలని ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్ పోలీసులను హైకోర్టు గట్టిగా ఆదేశించింది.

హైకోర్టు ఆదేశాల కంటే ముందే.. విజయవాడ రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులోనూ విజయలక్ష్మి ప్రైవేట్ పిటిషన్ వేశారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి కీలక ఆదేశాలు జారీ చేశారు. మే 1వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన పూర్తి సీసీటీవీ ఫుటేజ్‌ను ఎవరూ ట్యాంపరింగ్ చేయకుండా భద్రపరచాలన్నారు. అలాగే సాయికృష్ణ, అతని తల్లి ఫోన్ల కాల్ డేటా రికార్డులను కూడా కోర్టుకు సమర్పిం చాలని ఆదేశించారు.ఈ వ్యవహారంపై ప్రభుత్వం వేసిన 'సిట్' దర్యాప్తులో అసలు నిజాలు బయటకు వస్తున్నాయి. ప్రాథమిక ఆధారాల ప్రకారం సీఐ నాగరాజును విధుల్లో నుంచి సస్పెండ్ చేశారు. బాధితుడి తల్లి ఫిర్యాదు మేరకు కొత్త చట్టం ప్రకారం.. సస్పెండైన కృష్ణలంక సీఐ నాగరాజుపై భారతీయ న్యాయ సంహిత లోని సెక్షన్లు 127 (4), 127(6) (అక్రమ నిర్బంధం), 103(1) (హత్య), మరియు 238 (సాక్ష్యాధారాల నాశనం) కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ట్రాఫిక్ విధులకు శిక్షణ పొందిన పోలీసు సిబ్బందితో సైబరాబాద్ సీపీ సమావేశం

**సైబరాబాద్ వెలుతురు జూన్ 23:**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ విధుల నిర్వహణ కోసం ప్రత్యేక శిక్షణ పొందిన 150 మంది గ్రేహౌండ్స్ పోలీసు సిబ్బందితో మంగళవారం రోజున సైబరాబాద్ సీపీ కార్యాలయం ఆడిటో రియంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్., సమావేశమయ్యారు.వారం రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బందితో సీపీ మాట్లాడి, శిక్షణలో నేర్చుకున్న అంశాల గురించి తెలుసుకున్నారు. ట్రాఫిక్ విధులను సమర్థవంతంగా నిర్వహించడం, ప్రజలతో మర్యాదగా వ్యవహరించడం, ట్రాఫిక్ నియంత్రణలో పాటించాల్సిన విధానాలపై సూచనలు చేశారు.శి క్షణలో ట్రాఫిక్ నిర్వహణ, ట్రాఫిక్ ఇంజనీరింగ్, చట్ట పరమైన అంశాలు వంటి విషయాలపై ఇండోర్, అవుట్‌డోర్ తరగతుల ద్వారా అవగాహన కల్పించినట్లు తెలిపారు. అలాగే హెల్మెట్ వినియోగం, లేన్ క్రమశిక్షణ, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై తీసుకో వాల్సిన చర్యలను వివరించారు.ట్రాఫిక్ విధులకు ఆటంకం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసు కోవాలని సూచించిన సీపీ, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచాలని చెప్పారు. ప్రమాదాల వల్ల కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, ప్రతి పోలీసు సిబ్బంది ప్రజల్లో బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌పై చైతన్యం కల్పించాలని సూచించారు.ఐటీ కారిడార్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని, అక్కడ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ వర్షాకాలంలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. సేవాభావంతో, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు తక్షణ సహాయం అందించాలని, తద్వారా పోలీసు శాఖపై ప్రజల విశ్వాసం మరింత పెరిగేలా కృషి చేయాలని పేర్కొన్నారు. తమ ప్రవర్తన, పనితీరుతో పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, ఎస్‌బీ డీసీపీ సుధీంద్ర, ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి, సైబర్ క్రైమ్ డీసీపీ సాయి మనోహర్, సీఏఆర్ & హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, శేరిలిం గంపల్లి ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, ట్రాఫిక్ అడ్మిన్ ఏడీసీపీ నరేందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.





# మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి హౌస్ అరెస్ట్

- **యూరియా యాప్ నిరసనకు వెళ్తుండగా అదుపులోకి..**
- **యూరియా యాప్ రద్దుకు బీఆర్‌ఎస్ రైతు ధర్నా**
- **ఎల్లారెడ్డి కార్యక్రమానికి ముందే పోలీసుల చర్య**
- **ప్రశాంత్‌రెడ్డి గృహనిర్బంధంపై కేటీఆర్, హరీశ్‌రావు ఆగ్రహం**
- **రైతుల గొంతు నొక్కే ప్రయత్నమని విమర్శ**
- **యూరియా కొరతపై ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్‌ఎస్**
- **యాప్ విధానంతో రైతులకు తీవ్ర ఇబ్బందులని ఆరోపణ**
- **ఫోన్‌లో మాట్లాడి సంఘీభావం తెలిపిన కేటీఆర్, హరీశ్‌రావు**
- **పోలీసుల తీరుపై తీవ్ర అభ్యంతరం**
- **రైతుల సమస్యలపై పోరాటం కొనసాగుతుందని స్పష్టం**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 23:**

యూరియా పంపిణీలో అమలవుతున్న యాప్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో భారత రాష్ట్ర సమితి చేపట్టిన రైతు ధర్నాకు వెళ్లే క్రమంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని పోలీసులు మంగళవారం ఆయన బంజారాహిల్స్ నివాసంలో గృహనిర్బంధం చేశారు. దీంతో ఎల్లారెడ్డిలో చేపట్టాల్సిన ధర్నాకు ఆయన హాజ రుకాలేకపోయారు.యూరియా కొరత, యాప్ విధానానికి వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ రైతు ధర్నాకు పిలు పునిచ్చింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రశాంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి బయలుదేరేందుకు సిద్ధమవుతుండగా పోలీసులు ఆయన నివాసానికి చేరుకుని బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు.

ప్రశాంత్‌రెడ్డిని గృహనిర్బంధం చేయడాన్ని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ప్రశాంత్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి సంఘీభావం తెలిపారు. రైతుల తరపున ప్రశ్నించే నాయకులను అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నించడం ప్రజా స్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు.రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పైగా యూరియా పంపిణీలో అమలు చేస్తున్న యాప్ విధానం మరిన్ని సమస్యలకు దారితీస్తోందని వారు ఆరోపించారు. రైతుల ఇబ్బందులను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, సమస్యలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై పోలీసులను ప్రయోగించడం దురదృష్టకరమని విమర్శించారు.రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, యూరియా పంపిణీలో నెలకొన్న ఇబ్బందులను తొలగించాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రైతుల తరపున తమ పోరాటం కొనసాగు తుందని స్పష్టం చేశారు.



# వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలి

- **నాణ్యమైన ఆరోగ్య సేవలు ప్రతి ఒక్కరికి అందించాలి**
- **గర్భిణీ స్త్రీల పరీక్షలు, సేవలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలీ**
- **మురికివాడాలలో (స్లమ్స్)లో నివసిస్తున్న పేద ప్రజలకు క్రమం తప్పకుండా ఆరోగ్య సేవలు అందించాలి**
- **సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించి వ్యాధులు వ్యాపించకుండా చర్యలు చేపట్టాలి**
- **డా: పుట్ల శ్రీనివాస్ జిల్లా వైద్య & ఆరోగ్యశాఖ అధికారి, హైదరాబాద్**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 23:**

నాంపల్లి క్లస్టర్ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, బస్తీ దవాఖాన, ఆర్ బి ఎస్ కే చెందిన వైద్యాధికారులు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ANMలు మరియు ఆశా కార్యకర్తలతో సమీక్ష సమావేశం ఈరోజు యశోద హాస్పిటల్ సోమాజిగూడ సమావేశ మందిరంలో నిర్వ హించబడింది.ఈ సందర్భంగా DM&HO గారు మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉండే ఆరోగ్య సేవలను సమర్థ వంతంగా అందించడం ప్రతి ఆరోగ్య సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, గర్భిణీల సంరక్షణ, శిశు టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ మరియు ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గునియా పై ఇంటింటి ఆరోగ్య సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అలాగే, ఆరోగ్య సేవల పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించి, ప్రతి అర్హులైన లబ్ధిదారునికి ప్రభుత్వ ఆరోగ్య పథకాల




ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా టిబి అధికారి డా : చల్లా దేవి, క్లస్టర్ ఆఫీసర్ డా. మురళీధర్ , జిల్లా మాస్ మీడియా అధికారి జక్కుల రాములు, డిపిఓ సంతోష్, సబ్ యూనిట్ ఆఫీసర్ ఆంజనేయులు పాల్గొని వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో హాజరైన వైద్యాధికారులు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ANMలు మరియు ఆశా కార్యకర్తలకు అవసరమైన సూచనలు, మార్గ దర్శకాలు అందించారు.



# రైతులకు నాణ్యమైన విత్తనాలే విజయవంతమైన పంటకు పునాది: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు






- **రాష్ట్రవ్యాప్తంగా 2,601 రైతు వేదికల్లో విత్తన మేళాలు ప్రారంభం**
- **7 సన్న వరి రకాలకు ప్రత్యేక బోనస్‌తో రైతులకు ప్రోత్సాహం**
- **విత్తనాల విక్రయంతో పాటు శాస్త్రీయ సాగుపై అవగాహన కార్యక్రమాలు**
- **రైతునేస్తం కార్యక్రమంలో మంత్రులు తుమ్మల, ఉత్తమ్**

**న్యూఢిల్లీ వెలుతురు జూన్ 23:**

రైతులకు నాణ్యమైన, ధ్రువీకరించిన విత్తనాలను అందుబాటులోకి తీసుకువచ్చి అధిక దిగుబడులు సాధించేలా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విత్తన మేళాలను సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్ నుండి పౌర సరఫరాల శాఖ మంత్రి శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, రైతులు నాణ్యమైన విత్తనాలను ఉపయోగించడం ద్వారా పంట ఉత్పాదకతను గణనీయంగా పెంచుకోవచ్చని అన్నారు. రైతులకు సరైన సమయంలో నాణ్యమైన విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. వ్యవసాయ రంగంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.అంతర్జాతీయ, జాతీయ మార్కెట్లలో అధిక డిమాండ్ ఉన్న ఏడు సన్న వరి రకాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులతో సమగ్రంగా చర్చించిన అనంతరం ప్రభుత్వం ప్రోత్సహించాలని నిర్ణయించిందన్నారు. రైతులు ఈ రకాల సాగుకు ముందుకు రావాలని, ఈ ఏడు రకాలకే ప్రభుత్వం ప్రత్యేక బోనస్ అందించనున్నట్లు తెలిపారు. దీంతో రైతులకు అధిక ఆదాయం లభించడంతో పాటు తెలంగాణ బియ్యానికి ప్రపంచ మార్కెట్లలో మరింత గుర్తింపు లభిస్తుందని అన్నారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి విత్తనాలతో పాటు పప్పు జాతులు, నూనెగింజలు, కూరగాయల వంటి ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను కూడా రైతులకు అందుబాటులో ఉంచినట్లు మంత్రి తెలిపారు. పంటల వైవిధ్యీకరణ ద్వారా రైతులు నష్టాలను తగ్గించుకొని స్థిరమైన ఆదాయాన్ని పొందే అవకాశముందని పేర్కొన్నారు.జూన్ 23 నుంచి 30 వరకు రాష్ట్రంలోని 2,601 రైతు వేదికల్లో విత్తన మేళాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేళాల్లో రైతులకు 1,24,649 క్వింటాళ్ల వరి విత్తనాలు, 6,913 క్వింటాళ్ల పప్పు జాతి విత్తనాలు, 11,815 క్వింటాళ్ల నూనెగింజల విత్తనాలు, 1,339 క్వింటాళ్ల కూరగాయల విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. అదనంగా నానో యూరియా, నానో డి.ఏ.పీ. ఎరువులను కూడా రైతుల కొనుగోలుకు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.విత్తనాల విక్రయంతో పాటు వాటి సాగు విధానాలు, పంట యాజమాన్యం, సమగ్ర పంట సంరక్షణ, అధిక దిగుబడుల సాధనకు సంబంధించిన అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులు, అనుబంధ శాఖల సిబ్బంది, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ధ్రువీకరించిన విత్తనాలను కొనుగోలు చేసి శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సంచాలకులు గోపి గారు, జగిత్యాల శాసనసభ్యులు శ్రీ సంజయ్ గారు మరియు వరంగల్ శాసనసభ్యులు శ్రీ దొంతి మాధవరెడ్డి మరియు పాలకుర్తి శాసనసభ్యులు యశస్విని రెడ్డి మరియు విత్తన తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ శ్రీ అన్వేష్ రెడ్డి గారు వివిధ జిల్లాల కలెక్టర్లు రైతులు శాస్త్రవేత్తలు అధికారులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ పిట్టల సంపత్ గారిది ఆత్మహత్య కాదు ప్రభుత్వ హత్య

- **తెలంగాణ సర్పంచ్ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్**

**హుస్నాబాద్ వెలుతురు జూన్ 23:**



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మహమ్మాదాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ పిట్టల సంపత్ గారు ఆత్మహత్య చేయనుకోవడం చాలా బాధాకరం ,తను సర్పంచ్ గా చేసిన హయాంలో లక్షల రులు అప్పులుగా తెచ్చి గ్రామ అభివృద్ధి కోసం వెచ్చిస్తే బిల్లులు రాక భూమి, పండ్ల తోట అమ్మిన కూడా అప్పులు చెల్లించలేక మనస్తాపం చెంది ఈ రోజు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడం జరిగింది,మాజీ సర్పంచ్ ముమ్మాటికీ ప్రభుత్వ హత్యగా చెప్పుకోవచ్చు, గతంలో పెండింగ్ బిల్లుల కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ మానవ హక్కుల కమిషనర్ గారికి వెళ్లి కేసు వేయడం జరిగింది అయినకుడా సీఎం రేవంత్ రెడ్డి పంచాయతీరాజ్ మంత్రి సీతక్క గారు స్పందించకుండా ఉండడం అనేది ఎంత దుర్మార్గ చర్యనో హుస్నాబాద్ ప్రజలు అర్థం చేసుకోవాలి,పెండింగ్ బిల్లులు చెల్లించాలని చివరగా హుస్నాబాద్ ఏసీపీ ఆఫీస్ ముందు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాలపడడం జరిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు పంచాయతీరాజ్ మంత్రి సీతక్క గారు స్పందించకపోవడం చాలా బాధకారం, ఇప్పటికైనా మాజీ సర్పంచ్ గారి పెండింగ్ బిల్లులు చెల్లించి, 1కోటి రూపాయలు రులు ఎక్సగ్రేసియా చెల్లించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాను,అలాగే మిగితా మాజీ సర్పంచుల యొక్క పెండింగ్ బిల్లులు కూడా విడుదల చేయాలి లేకుంటే వారు ఆర్థిక ఇబ్బందులను తట్టుకోక ఏదైనా చేసుకోవాలనే ఆలోచన వస్తుంది కాబట్టి మాజీ సర్పంచుల యొక్క బిల్లులు చెల్లించి మాజీ సర్పంచుల కుటుంబాలను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాము,

# జన్ Z చేతిలోనే రేపటి సామాజిక తెలంగాణ

- **భయపడొద్దు, ప్రశ్నించండి**
- **42% BC పోరాట కమిటీ**
- **డా. అవ్వారు వేణు కుమార్**

హైదరాబాద్ వెలుతురు జూన్ 23:



రేపటి సామాజిక తెలంగాణ నిర్మాణం జన్ Z యువత చేతిలోనే ఉందని 42% BC పోరాట కమిటీ స్టేట్ కోఆర్డినేటర్ డా. అవ్వారు వేణు కుమార్ స్పష్టం చేశారు."జన్ Z ఉద్యమం అంటే రాళ్లు విసరడం కాదు, రాజ్యాంగం చదివి గొంతు విప్పడం" అని ఆయన అన్నారు.రోజురోజుకు పెరిగిపోతున్న ధరలు, పేదవాడికి దూరమవుతున్న విద్య, చదివిన చదువుకు తగ్గ ఉద్యోగాలు లేకపోవడం, ఎమ్మెల్యే–ఎంపీలకు ఒక దారి, సాధారణ పౌరులకు క్యూ అనే వివక్ష వంటి సవాళ్లను ప్రశ్నించాల్సిన బాధ్యత జన్ Z యువతపై ఉందని చెప్పారు.తెలంగాణలో 56% బిసి యువత ఉన్నామని, సంఖ్యాబలం ఉండి కూడా నిర్ణయాల్లో, రాజ్యాధికారంలో వాటా లేకపోవడం అసమానతకు నిదర్శనమని తెలిపారు. "లెక్కలు అడిగితేనే ప్రభుత్వాలు దిగొస్తాయి. మీ హక్కు ఏంటో, సమాజంలో మీ స్థానం ఏంటో తెలుసుకోండి" అని పిలుపునిచ్చారు."చదువు ఉద్యోగం కోసం మాత్రమే కాదు. సమాజంలోని అసమానతలను ప్రశ్నించడానికి చదువు ఒక ఆయుధం" అని గుర్తు చేశారు."నిరుద్యోగం మీ తప్పు కాదు. మౌనంగా భరిస్తే అదే మీ తప్పు అవుతుంది. జన్ Z యువతే రేపటి సామాజిక తెలంగాణను నిర్మిస్తుంది" అని డా. అవ్వారు వేణు కుమార్ ఆకాంక్షించారు.

# గంగపుత్రుల రాజకీయ చైతన్యం- విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, పారిశ్రామిక రంగాలలో వృత్తి హక్కుల రక్షణ కోసం సర్వతో ముఖాభివృద్ధికై- మన ఉద్యమం

**హైదరాబాద్ వెలుతురు జూన్ 23:**

గంగపుత్రులు శతాబ్దాలుగా చేపల వేట, చేపల పెంపకం, జలవనరుల సంరక్షణను తమ జీవనాధారంగా కొనసాగిస్తున్న సమాజం. దేశ ఆహార భద్రతలో, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో, మత్స్య సంపద అభివృద్ధిలో గంగపుత్రుల పాత్ర ఎంతో గొప్పది. అయినప్పటికీ విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, వృత్తి అభివృద్ధి వంటి రంగాలలో ఇంకా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గంగపుత్రుల రాజకీయ చైతన్యం, సామాజిక ఐక్యత, ఆర్థిక స్వావలంబన అత్యంత అవసరం.

ప్రభుత్వాలు చేపట్టవలసిన చర్యలు

మత్స్యకారులకు మొదటి ప్రాధాన్యత

a) చెరువులు, రిజర్వాయర్లు, నదులలో చేపల వేట హక్కులను స్థానిక గంగపుత్రుల ఫిషరీస్ సహకార సంఘాలకే ప్రాధాన్యతగా కేటాయించాలి. మధ్యవర్తుల జోక్యాన్ని తగ్గించి నిజమైన మత్స్యకారులకు ప్రయోజనం చేకూర్చాలి.

b) పాత పారిశ్రామిక సొసైటీలలో వేరే కులాలకు సభ్యత్వాలు ఇవ్వకూడదు.

c) గంగపుత్ర రక్షణ చట్టం తేవాలి.

d) గంగపుత్ర కార్పొరేషన్ ఏర్పాటుకు నిధులు కేటాయించి 90% శాతం సబ్సిడి ఇవ్వాలి.

e) మత్స్యశాఖ సొసైటీకి ఛైర్మన్ గంగపుత్రులకే ఇవ్వాలి.

f) రిజర్వాయర్ల దగ్గర పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి పరుస్తూ 70% ఉద్యోగ అవకాశాలు గంగపుత్రులకే కేటాయించాలి. ఉదా : బోట్లు, స్పీడ్ బోట్లు, పడవలు, షాపింగ్ కాంప్లెక్స్ లాంటివి ఏర్పాటు చేయాలి.

g) గ్రేటర్ హైదరాబాద్లో ఒక్కొక్క డివిజన్ పరిధిలో ఒక్కొక్క ఫిష్ మార్కెట్ ఏర్పాటు చేయాలి.

h) వివిధ ప్రాంతాల నుండి హైదరాబాద్కు దిగుమతి అవుతున్న చేపల మార్కెటింగ్ పై సెస్సి వసూలు చేసి రాష్ట్రంలో ఉన్న గంగపుత్రుల సంక్షేమానికి ఉపయోగించాలి.

చేపల పెంపకానికి ఆర్థిక సహాయం

a) సబ్సిడీపై చేప పిల్లల పంపిణీ

b) వలలు, పడవలు, ఐస్ బాక్సుల సరఫరా

c) తక్కువ వడ్డీ రుణాలు

d) ఆధునిక ఆక్వాకల్చర్ శిక్షణ

e) ప్రతి సొసైటీకి 5 ఎకరాల భూమి కేటాయించి చేపల పెంపకం చేయాలి, తగిన శిక్షణ ఇచ్చి చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

f) ప్రభుత్వం సబ్సిడి ఇచ్చి స్వతహాగా వాహనాలు వాళ్ళే కొనుక్కునే విధంగా ఏర్పాటు చేయాలి.

g) వంటి కార్యక్రమాలను మరింత విస్తరించాలి.

విద్యలో ప్రత్యేక అవకాశాలు

a) మత్స్యకార కుటుంబాల విద్యార్థులకు ప్రత్యేక స్కాలర్షిప్లు

b) హాస్టల్ సదుపాయాలు

c) పోటీ పరీక్షల కోచింగ్

d) ఉన్నత విద్యలో ప్రత్యేక రిజర్వేషన్లు

**అందుబాటులోకి తీసుకురావాలి**

ఉద్యోగ అవకాశాల పెంపు

ఫిషరీస్ శాఖ, ప్రభుత్వ సంస్థలు మరియు ఇతర రంగాలలో గంగపుత్ర యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు పెంచాలి.

మార్కెటింగ్ సదుపాయాలు

ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆధునిక ఫిష్ మార్కెట్లు, కోల్డ్ స్టోరేజీలు, రవాణా సదుపాయాలు ఏర్పాటు చేసి మత్స్యకారులకు సరైన ధర లభించేలా చూడాలి.





a) 50 సంవత్సరాలు నిండిన ప్రతి గంగపుత్ర మత్స్యకారుడికి నెలకు 5 వేల రూపాయలు ఫించను ఇవ్వాలి.

b) గంగపుత్ర కులవృత్తి చేసే మత్స్య మహిళలకు ప్రతి నెల 5 వేల రూపాయలు పించను ఇవ్వాలి.

c) ప్రమాదవశాత్తు చనిపోయిన ప్రతి మత్స్యకారుడికి 10 లక్షల ఎక్స్రేషియా ప్రకటించాలి.

ఫిషరీస్ సొసైటీల ద్వారా మార్కెటింగ్

a) ఫిషరీస్ సహకార సంఘాలు బలపడితే మత్స్యకారుల ఆదాయం పెరుగుతుంది.

b) తెలంగాణ రాష్ట్రంలో గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతంలో మత్స్య సొసైటీల ద్వారానే చేపలు అమ్మాలి.

c) మత్స్యకార పారిశ్రామిక సొసైటీలో మెంబర్రై ఉండాలి. ఐడి కార్డు ఉన్నవారు మాత్రమే చేపలు అమ్మాలి.

**చేపట్టవలసిన చర్యలు**

a) సంఘాల ద్వారా నేరుగా చేపల విక్రయం.

b) మధ్యవర్తులను తగ్గించడం.

c) బ్రాండెడ్ ఫిష్ ఉత్పత్తుల విక్రయం.

d) ఆన్లైన్ మార్కెటింగ్ మరియు డిజిటల్ చెల్లింపులు.

e) కోల్డ్ చైన్ వ్యవస్థ ఏర్పాటు.

f) చేపల ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించడం.

ఇవి మత్స్యకారులకు అధిక లాభాలను అందిస్తాయి.

బైరు శేఖర్ గంగపుత్ర సంగం నాయకులు, ప్రొఫెసర్ సుదర్శన్, BRS రాష్ట్ర నాయకులు ముఠా జయసింహ, కవి గాయకుడు రచయిత విమర్శకుడు అంబటి వెంకన్న, ప్రదేశ్ గంగపుత్ర సంగం రాష్ట్ర అధ్యక్షులు గడప శ్రీహరి,

TRGS రాష్ట్ర అధ్యక్షులు మెట్టు ధనరాజ్, చైతన్య సమితి అధ్యక్షులు మంగిలిపల్లి శంకర్,

కాంగ్రెస్ పార్టీ నాయకులు తవిడబోయిన గిరిబాబు,

బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి,

TRGS అడ్వైసర్ వినోద్ కుమార్, గంగపుత్ర రవి,

గాలి సత్యనారాయణ,

పాక రవిప్రసాద్, ముల్కీ మహేందర్, రణ్వీర్ లక్ష్మణ్,

అమరానంద్, గులాబ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మియాపూర్‌లో వరద కష్టాలకు చెక్.. రంగంలోకి హైడ్రా

- **సోమవారం రాత్రి కురిసిన 12 సెంటీమీటర్ల భారీ వర్షంతో మునిగిన రోడ్లు**
- **ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా అదనపు సమాంతర పైపులైన్ల నిర్మాణం**
- **వరద ప్రాంతాల్లో హైడ్రా, హెచ్ఎండీఏ ఉన్నతాధికారుల క్షేత్రస్థాయి పరిశీలన**
- **హెచ్‌డీఎఫ్‌సీ చౌరస్తా మాల్ వద్ద కాలువ స్లాబ్ తొలగించి పూడిక తీయాలని సూచన**

**హైదరాబాద్, వెలుతురు జూన్ 23:**

మియాపూర్ – బాచుపల్లి ప్రధాన రహదారిపై వరద నీరు సాఫీగా సాగిపోయేలా బీకే ఎన్‌క్లేవ్ వద్ద టాటా షోరూం ఎదురుగా అదనపు పైపులైన్ నిర్మాణ పనులు వేగంగా ప్రారంభమయ్యాయి. సోమవారం అర్ధరాత్రి నగరంలో కురిసిన 12 సెంటీమీటర్ల భారీ వర్షానికి ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున వరద నీరు నిలిచిపోయింది. వాహనాలు సైతం మునిగిపోయే పరిస్థితి రావడంతో హైడ్రా సిబ్బంది రాత్రంతా మోటార్లు పెట్టి వరద నీటిని తొలగించారు. ఈ నేపథ్యంలో, మంగళవారం వరద ప్రభావిత ప్రాంతాలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కమిషనర్ వెంట హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, ట్రాఫిక్ ఏసీపీ ఆదిమూర్తి తదితరులు ఉన్నారు.

బీకే ఎన్‌క్లేవ్ వద్ద రోడ్డుపై వరద నీరు నిలబడడానికి గల కారణాలను కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డును దాటించే విధంగా గతంలో నిర్మించిన పైపుల సామర్థ్యం సరిపోకపోవడం వల్లే ఈ సమస్య తలెత్తిందని అధికారులు నిర్ధారించారు. దీంతో వెంటనే దానికి సమాంతరంగా ఒక మీటరు వైశాల్యం కలిగిన అదనపు పైపులైన్ నిర్మించాలని కమిషనర్ ఆదేశించారు. మంగళవారం రాత్రి 8 గంటల



నుంచే ఈ పనులు మొదలయ్యాయి. బుధవారం ఉదయానికి పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో హెచ్ఎండీఏ ఇంజినీర్లు, హైడ్రా అధికారులు ఈ పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. టాటా షో రూమ్ వైపు నుంచి రోడ్డు అవతలి వైపునకు ప్రధాన రహదారి కింద తవ్వి, ఈ అదనపు పైపులైన్‌ను పెద్దకూడి చెరువుకు అనుసంధానం చేస్తున్నారు. ఈ పనుల వల్ల స్థానికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వారితో మాట్లాడి ఒప్పించడంతో ఆటంకాలు తొలగిపోయాయి.అంతకుముందు, అదే మార్గంలోని హెచ్‌డీఎఫ్‌సీ చౌరస్తాలో ప్రధాన రహదారి కింద ఉన్న కల్వర్టులో ఒక వెంట్ మొత్తం పూడుకుపోవడాన్ని కమిషనర్ రంగనాథ్ గమనించారు. అక్కడ ఎదురుగా ఉన్న ఒక మాల్ నిర్వాహకులు ప్రధాన వరద కాలువపై పూడిక తీయడానికి కూడా వీల్లేకుండా స్లాబ్ వేయడంతోనే ఈ సమస్య తీవ్రమైందని అధికారులు గుర్తించారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ.. ఆ స్లాబ్‌ను అవసరమైన మేరకు వెంటనే తొలగించి, కాలువలోని మొత్తం పూడికను తీసివేయాలని ఆదేశించారు. గుర్నాథ్ చెరువుకు వరద నీరు సాఫీగా వెళ్లేలా తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో హెచ్ఎండీఏ, సీఎంసీ ఇంజినీర్లతో పాటు హైడ్రా డీఎఫ్ఓ గౌతమ్, ఎస్ఎఫ్ఓలు శ్రీనివాస్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రవాణా శాఖ
తెలంగాణ

# వాహన తనిఖీలు ఎందుకు నిర్వహిస్తారు?

## ప్రతి పౌరుడు తెలుసుకోవాల్సిన విషయం

పోలీసు శాఖ
తెలంగాణ

మన దేశంలో రహదారి భద్రతను మెరుగుపరిచడం, ప్రమాదాలను తగ్గించడం, నేరాలను అరికట్టడం మదియు ప్రతి పౌరుడి ప్రాణాలను రక్షించడం కోసం రవాణా శాఖ (RTO) మదియు పోలీసు శాఖ నిరంతరం వాహన తనిఖీలు నిర్వహిస్తుంటాయి. కొంతమంది ఈ తనిఖీలను ఇబ్బందిగా భావించినప్పటికీ, వాస్తవానికి ఇవి ప్రజల సంక్షేమం మదియు భద్రత కోసం చేపట్టే అత్యంత ముఖ్యమైన చర్యలు.




### వాహన తనిఖీలు ప్రధాన ఉద్దేశాలు

**1 రహదారి ప్రమాదాలను నివారించడం**
నిర్లక్ష్యం, అధిక వేగం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్/సీట్‌బెల్ట్ ధరించకపోవడం వంటి కారణాల వల్ల జరిగే ప్రమాదాలను తనిఖీల ద్వారా గణనీయంగా తగ్గించవచ్చు.

**2 హెల్మెట్ మదియు సీటుబెల్ట్ వినియోగాన్ని ప్రోత్సహించడం**
ద్విచక్ర వాహనదారులు మదియు వెనుక ప్రయాణికులు హెల్మెట్ ధరించాలి. నాలుగు చక్రాల వాహనాల్లో ప్రతి ఒక్కరూ సీటుబెల్ట్ ధరించడం ప్రాణాలను కాపాడగలదు.

**3 మద్యం సేవించి వాహనం నడపడాన్ని అరికట్టడం**
మద్యం సేవించడం వల్ల ప్రమాదాలు పెరుగుతాయి. బ్రెత్ అనలైజర్ పరీక్షల ద్వారా మద్యం సేవించి వాహనం నడిపేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రాణాలను రక్షించవచ్చు.

**4 చెల్లుబాటు అయ్యే వాహన పత్రాలను పరిశీలించడం**
డ్రైవింగ్ లైసెన్స్, RC, ఇన్స్యూరెన్స్, PUC, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ వంటి పత్రాలను పరిశీలించడం ద్వారా చట్టబద్ధమైన వాహన వినియోగాన్ని నిర్ధారిస్తారు.

**5 నేరాల నియంత్రణ**
దొంగిలించబడిన వాహనాలు, నకిలీ నంబర్ ప్లేట్లు, అక్రమ రవాణా, నేరాలకు ఉపయోగించే వాహనాలను గుర్తించడంలో తనిఖీలు ఎంతో ఉపయోగపడతాయి.

**6 ట్రాఫిక్ క్రమశిక్షణను పెంపొందించడం**
అధిక వేగం, మొబైల్ ఉపయోగించడం, ఓవర్‌లోడింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, సిగ్నల్స్ ఉల్లంఘించడం వంటి ప్రమాదకర అలవాట్లను నియంత్రించడంలో తనిఖీలు కీలక పాత్ర పోషిస్తాయి.

**7 బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాట్లను పెంపొందించడం**
చట్టాలను శిక్షల కోసం కాకుండా మన భద్రత కోసం రూపొందించారని ప్రజలకు అవగాహన కల్పించడం తనిఖీల ముఖ్య ఉద్దేశం.

### ప్రజలు చేయాల్సినవి

- ఎల్లప్పుడూ ట్రాఫిక్ నిబంధనలను పాటించండి.
- హెల్మెట్ మదియు సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించండి.
- మద్యం సేవించి ఎప్పుడూ వాహనం నడపవద్దు.
- డ్రైవింగ్ లైసెన్స్, RC, ఇన్స్యూరెన్స్, PUC వంటి అవసరమైన పత్రాలను వెంట ఉంచుకోండి.
- తనిఖీల సమయంలో అధికారులకు మర్యాదపూర్వకంగా సహకరించండి.
- ట్రాఫిక్ నియమాలను మీ కుటుంబ సభ్యులు మదియు స్నేహితులకు కూడా తెలియజేయండి.

### ముగింపు

వాహన తనిఖీలు ప్రజలను ఇబ్బంది పెట్టడానికి నిర్వహించబడవు. అవి ప్రతి కుటుంబంలో ఆనందం నిలిచి ఉండేందుకు, ప్రతి ప్రయాణం సురక్షితంగా ముగియేందుకు, ప్రతి పౌరుని ప్రాణాలను కాపాడేందుకు నిర్వహించబడే ప్రజాహిత కార్యక్రమం.



"ట్రాఫిక్ నియమాలు శిక్షించడానికి కాదు... ప్రాణాలను రక్షించడానికి."

జాగ్రత్తగా డ్రైవ్ చేయండి సురక్షితంగా ఉండండి

"మీ భద్రతే మా బాధ్యత... మీ సహకారమే మా బలం."

**సురక్షిత ప్రయాణం – సంతోషకరమైన కుటుంబం – బాధ్యత మనందరిది.**

రవాణా శాఖ, తెలంగాణ మదియు పోలీసు శాఖ, తెలంగాణ

# ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ దత్తాత్రేయుడు నోరికి 'పద్మభూషణ్' పురస్కారం

- రాష్ట్రీయ భవన్‌లో ఘనంగా అవార్డును ప్రధానం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- వైద్య రంగంలో చేసిన విశిష్ట సేవలకుగాను దేశ మూడవ అత్యున్నత పౌర పురస్కారం
- హైదరాబాద్ బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి స్థాపనలో కీలక పాత్ర
- తెలుగు రాష్ట్రాల్లో క్యాన్సర్ కేర్ సలహాదారుగా సేవలు



**హైదరాబాద్, వెలుతురు జూన్ 23:**

ప్రముఖ భారతీయ-అమెరికన్ రేడియేషన్ ఆంకాలజిస్ట్, క్యాన్సర్ వైద్య రంగంలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన డాక్టర్ దత్తాత్రేయుడు నోరిని దేశ మూడవ అత్యున్నత పౌర పురస్కారం 'పద్మభూషణ్' వరించింది. మంగళవారం నాడు రాష్ట్రీయ భవన్‌లో అత్యంత వైభవంగా జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆయన ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. క్యాన్సర్ చికిత్స రంగంలో నాలుగు దశాబ్దాలుగా ఆయన అందించిన అసాధారణ సేవలకుగాను కేంద్ర ప్రభుత్వం ఈ గౌరవాన్ని ప్రకటించింది. న్యూయార్క్‌లోని ప్రఖ్యాత కార్నెల్ మెడికల్ సెంటర్‌లో ప్రొఫెసర్‌గా, ఆంకాలజీ చైర్మన్‌గా, క్యాన్సర్ సెంటర్ డైరెక్టర్‌గా పనిచేసిన ఆయన.. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ రోగుల మనుగడ రేటును పెంచే పలు వినూత్న చికిత్సా విధానాలను అభివృద్ధి చేశారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా మంతడ గ్రామంలో 1947 అక్టోబర్ 18న ఒక తెలుగు కుటుంబంలో దత్తాత్రేయుడు నోరి జన్మించారు. కర్నూలు మెడికల్ కాలేజీలో వైద్య విద్యను పూర్తి చేసిన ఆయన, 1976 లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పీజీ పట్టా పొందారు. ఆ తర్వాత అమెరికాలోని ప్రముఖ మెమోరియల్ స్లోన్ కెట్టెరింగ్ క్యాన్సర్ సెంటర్‌లో చేరి, క్యాన్సర్ పరిశోధనల్లో సరికొత్త మైలురాళ్లను అధిగమించారు. అంతర్జాతీయంగా ఎన్నో విజయాలు సాధించినప్పటికీ, ఆయన మాతృభూమితో తన బంధాన్ని ఎప్పుడూ వీడలేదు. హైదరాబాద్‌లో బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ స్థాపనలో వ్యవస్థాపక సభ్యుడిగా, చీఫ్ సైంటిఫిక్ అడ్వైజర్‌గా వ్యవహరిస్తూ దేశంలో క్యాన్సర్ వైద్య మౌలిక వసతుల బలోపేతానికి ఎనలేని కృషి చేశారు.

అంతర్జాతీయ అణుశక్తి సంస్థ కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తూ అభివృద్ధి చెందుతున్న దేశాలకు క్యాన్సర్ నివారణ వ్యూహాలపై ఆయన ఎన్నో సూచనలు చేశారు. ఆంకాలజీపై 300 కి పైగా శాస్త్రీయ పత్రాలు, నాలుగు పుస్తకాలను రచించిన ఆయన.. ప్రపంచవ్యాప్తంగా వందలాది మంది వైద్య నిపుణులను తీర్చిదిద్దారు. ప్రస్తుతం మెమోరియల్ స్లోన్ కెట్టెరింగ్ క్యాన్సర్ సెంటర్-చెన్నైకి సీనియర్ అడ్వైజర్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ నోరి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలకు క్యాన్సర్ సంరక్షణ విభాగంలో అధికారిక సలహాదారుగా ఉన్నారు. గతంలో ఆయన సేవలను గుర్తిస్తూ అమెరికాలో ఎల్లిస్ ఐలాండ్ మెడల్ ఆఫ్ ఆనర్, 2015 లో భారత ప్రభుత్వం నుండి పద్మశ్రీ పురస్కారం, ఇండియన్ క్యాన్సర్ కాంగ్రెస్ నుండి 'లివింగ్ లెజెండ్ ఇన్ క్యాన్సర్' వంటి ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులు లభించాయి. తాజాగా అంకితభావంతో కూడిన ఆయన జీవితకాల కృషికి దక్కిన పద్మభూషణ్ పురస్కారం పట్ల తెలుగు రాష్ట్రాల ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఉగ్రవాదం, సైబర్ సవాళ్లపై ఉమ్మడి పోరు

- బ్రిక్స్ వేదికగా ప్రధాని మోదీ పిలుపు
- ఢిల్లీలో ముగిసిన 16వ బ్రిక్స్ జాతీయ భద్రతా సలహాదారుల సదస్సు
- సరికొత్త సాంకేతిక ముప్పులను ఎదుర్కొనేందుకు ఉమ్మడి వ్యూహాలు అవసరం
- భద్రతా విభాగాల అధిపతులతో ప్రత్యేకంగా భేటీ అయిన మోదీ
- గ్లోబల్ సౌత్ దేశాల రక్షణ, అభివృద్ధికి భారత్ చైర్మన్‌షిప్ పెద్దపీట

**న్యూఢిల్లీ, వెలుతురు జూన్ 23:**

మారుతున్న అంతర్జాతీయ భద్రతా పరిణామాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు బ్రిక్స్ కూటమి దేశాల మధ్య వ్యూహాత్మక, భద్రతా సహకారం మరింత బలోపేతం కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మంగళవారం నాడు ఢిల్లీలో భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ అధ్యక్షతన 16వ బ్రిక్స్ దేశాల ఎన్ఎస్ఏల సదస్సు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగింది. ఈ సదస్సు ముగిసిన అనంతరం వివిధ దేశాల నుండి విచ్చేసిన భద్రతా ఉన్నతాధికారులు, ఎన్ఎస్ఏల ప్రతినిధి బృందం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా భేటీ అయింది. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చితి పరిస్థితుల్లో ప్రపంచ భద్రతా సవాళ్లను అధిగమించడంలో బ్రిక్స్ కూటమి కీలకమైన వేదికగా అవతరించిందని కొనియాడారు.సమావేశం అనంతరం ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. బ్రిక్స్ భద్రతా విభాగాల అధిపతులను కలవడం సంతోషంగా ఉందన్నారు. ఉగ్రవాదం, సైబర్ సెక్యూరిటీతో పాటు సరికొత్తగా పుట్టుకొస్తున్న సాంకేతికతల వల్ల ఎదురవుతున్న ముప్పులను ఉమ్మడిగా ఎదుర్కోవడానికి బ్రిక్స్ దేశాలు పరస్పర సహకారాన్ని పెంచుకోవాలని స్పష్టం చేశారు. భారత్ ఈ ఏడాది వహించిన చైర్మన్‌షిప్ బాధ్యతలు.. గ్లోబల్ సౌత్ దేశాల ప్రాధాన్యతలకు పూర్తి స్థాయిలో మద్దతునిస్తాయని, ప్రపంచాన్ని మరింత సురక్షితంగా, అందరినీ కలుపుకుపోయేలా తీర్చిదిద్దడానికి దోహదపడతాయని పునరుద్ఘాటించారు. ఈ ఏడాది భారత్ 'రెసిలియన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్, సస్టైనబిలిటీ' అనే ప్రత్యేక నినాదంతో ముందుకు సాగుతోందని గుర్తుచేశారు.అంతకుముందు జరిగిన సదస్సులో భారత ఎన్ఎస్ఏ అజిత్ దోవల్ మాట్లాడుతూ.. బ్రిక్స్ అనేది అంతర్జాతీయంగా అత్యంత విశిష్టమైన కూటమి అని, ప్రపంచ శాంతి భద్రతల్లో ఈ దేశాలు కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. సాంప్రదాయేతర భద్రతా సవాళ్లయిన ఇంధన భద్రత, ఆహార భద్రత, గ్లోబల్ సప్లై చైన్ వ్యవస్థల రక్షణతో పాటు ఉగ్రవాద నెట్‌వర్క్‌లు వాడుతున్న ఆధునిక శాతం సాంకేతికతలపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చించారు. ఈ సదస్సు సందర్భంగా చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ, రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ సెర్గీ షోయిగుతో పాటు బ్రెజిల్, దక్షిణాఫ్రికా, యూఏఈ, ఈజిప్ట్, ఇరాన్, ఇండోనేషియా, ఇథియోపియా దేశాల ఉన్నతాధికారులతో అజిత్ దోవల్ విడివిడిగా ద్వైపాక్షిక చర్చలు జరిపారు. 2026 లో భారత్ నాలుగోసారి బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తూ తన ప్రాధాన్యతను చాటుకుంది.






# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో మొదటి దశ అత్యంత కీలకం: జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక

**నారాయణపేట, వెలుతురు జూన్ 23:**



స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-2026 కార్యక్రమంలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు నిర్వహించే హౌస్-టు-హౌస్ ఎన్యుమరేషన్ ప్రక్రియ అత్యంత కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్ ప్రియాంక తెలిపారు. మంగళవారం మక్తల్ పట్టణంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో ఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలకు ఎస్ఐఆర్‌పై ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే ఇండ్ల సర్వేలో ప్రతి ఓటరుకు తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫామ్ అందజేయాలని, ఒకవేళ వారు ఇంట్లో లేకపోతే కనీసం మూడు సార్లు సందర్శించి ఫామ్ అందించే ప్రయత్నం చేయాలని, ఇందుకు తగిన రసీదు లేదా ఆధారాలు ఉంచుకోవాలని ఆదేశించారు.2002 ఓటరు జాబితాలో పేరు ఉన్న అర్హులైన ఓటర్లకు ఈ దశలో ఎటువంటి సహాయక పత్రాలు అడగాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాను 2002 జాబితాతో మ్యాపింగ్ చేసి, వివరాలను ధృవీకరించి సంతకం తీసుకుంటే సరిపోతుందని తెలిపారు. జూలై 31న ప్రచురించే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఎన్యుమరేషన్ ఫామ్‌లు సమర్పించిన వారి పేర్లు మాత్రమే ఉంటాయని, ఫామ్‌లు ఇవ్వని వారి పేర్లు డ్రాఫ్ట్ జాబితాలో కనిపించకపోవచ్చని వివరించారు. అందువల్ల ఫామ్ పంపిణీ, వివరాల నమోదు, తిరిగి సేకరించడం అనే మూడు దశలను అత్యంత జాగ్రత్తగా పూర్తి చేయాలని సూచించారు.పట్టణ ప్రాంతాల్లో ఇండ్లు మారిన వారు, అద్దెకు నివసిస్తున్న వ్యక్తులు, కొత్తగా వచ్చిన నివాసితుల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని, వారు ఇతర నియోజకవర్గాల్లో ఓటర్లుగా ఉంటే ఫామ్-8 ద్వారా బదిలీ చేయించాలని కలెక్టర్ తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఫామ్-6 అందించి కొత్తగా ఓటరుగా నమోదు చేయాలని, సరైన ఆధారాలు లేకుండా ఏ పేరును తొలగించరాదని స్పష్టం చేశారు. రాబోయే మూడు నెలల పాటు అధికారులు ఈ కార్యక్రమంపైనే దృష్టి సారించాలని, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ దీనిని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, వివిధ మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com